RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 1 ISSUE NO : 1 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | బుధవారం, జూన్, 18, 2025 Tuesday, June,17,2025 | పేజిలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

## తమిళనాడు గవర్నర్ పై స్టాలిన్ ఫైర్..!

మరోసారి గవర్నర్ తీరుపై విమర్శలు గుప్పించిన తమిళనాడు సీఎం స్టాలిన్
సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా గవర్నర్ తీరు మార్చుకోలేదంటూ ఫైర్
కరుణానిధి పేరు మీద కొత్త విశ్వవిద్యాలయం ఏర్పాటు..!



**చెన్నై,జూన్,17:** తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచడంపై తమిళనాడులో కొంతకాలంగా చర్చనీయాంశంగా ఉన్న విషయం విదితమే. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించినా గవర్నర్ తన వైఖరిని మార్చుకోలేదని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తంజావూరులో మాజీ ముఖ్యమంత్రి కరు ణానిధి పేరు మీద కొత్త విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లును గవర్నర్ పెండింగ్‌లో ఉంచారని ముఖ్యమ ంత్రి స్టాలిన్ విమర్శించారు. నూతన విశ్వవిద్యాల యానికికరుణానిధి పేరు పెట్టే అంశంపై తొలుత తానుసంకోచించానని, అయితే అనేకపార్టీలు క రుణానిధి పేరు పెట్టాలని పట్టుబట్టినందున అసెం బ్లీలో బిల్లును ఆమోదించి మే 2న గవర్నర్‌కు ప ంపడం జరిగిందని ఆయన అన్నారు. అయినప్పటికీ, ఇంతవరకు ఆయన నుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. ఈ విషయంపై అనేకమార్లు సంప్రదించామని కూడా ఆయన పేర్కొన్నారు.

# గోదావరి-బనకచర్ల వివాదం

## అన్ని పార్టీల ఎంపీలతో నేడు

# సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ



**హైదరాబాద్,జూన్ 17,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై అనుసరించాల్సిన తదుపరి వ్యూహంపై చర్చిం చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశం రేపుసాయంత్రం 4 గంటలకు జరుగుతుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి ముఖ్యఅ తిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈకీలక భేటీకి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మం త్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజ య్‌లను గౌరవ అతిథు లుగా ఆహ్వానించినట్లు మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యు లకు ఆహ్వానాలు పంపామని, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల ఎంపీలకు వ్యక్తిగతంగా ఫోన్లు చేసి సమా వేశానికి రావాల్సిందిగా కోరినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "ట్రైబ్యునల్ తీర్పులకు, చట్టాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును చేపట్టాలని చూ స్తోంది. ఈ విషయంపై మేము ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి మాఅభ్యంతరాలను తెలియజేశాం. కేంద్ర జల శక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిసి ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రజల నీటి హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లుతుదని వివరించాం" అని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద ఉన్న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫీజబిలిటీ నివేదికను తిరస్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు.

## 3 ఎకరాల వరకు 'రైతుభరోసా' నిధులు జమ




**వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద 'రైతు భరోసా' నిధులను సోమవారం సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేసిన విషయం తెలిసిందే. తొలిరోజు 2 ఎకరాల వరకు ఉన్నరైతుల ందరి బ్యాంకు ఖాతాల్లోకి ఎకరానికి రూ.6 వేల చొప్పున నిధలను జమ చేశారు. 41.25 లక్షల మంది అన్నదాతలకు సంబంధించి 39.16 లక్షల ఎకరాలకు రూ.2,349.83 కోట్లు జమయ్యాయి. ఇక రెండో రోజు (నేడు) 3 ఎకరాల్లోపు భూమి ఉన్న 10.45 లక్షల మంది రైతులకు గాను రూ.1,55 1.89 కోట్లు విడుదల చేసినట్లుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రకటించారు. ఎకరాలతో సంబంధం లేకుండా త్వరలోనే మిగతా రైతులకు కూడా 'రైతు భరోసా' అందుతుందని, ఎవరూ నిరాశ పడాల్సిన అవసరం పేర్కొన్నారు.**



## 'యోగాడే'లో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

### దేశ ప్రజలకు ప్రధాని మోడీ కీలక పిలుపు

**న్యూఢిల్లీ,జూన్, 17:**అంతర్జాతీయ యోగా డే నేథప్యంలో దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీకీలక పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం లేఖ రాశారు. యోగాడేలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ అంతర్జాతీయ యోగా డేను అత్యంత ఘనంగా జరుపు కుందామని పి లుపు నిచ్చారు. యోగాకు దేశ ప్రజల నుంచి ప్రత్యేక ఆదరణ ఉం టుందని అన్నారు. కాగా, ఈనెల 21న ఆంధ్రప్రదే శ్‌లోని విశాఖలో యోగా డేను 'యోగాంధ్ర'గా నామకరణం చేసి భారీ ఎత్తున నిర్వహి స్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన బోతున్నారని సీఎంచంద్ర బాబు చెప్పారు. 'అంతర్జాతీయ యోగాదినోత్స వం' సందర్భంగా ప్రధాని మోడీ సమక్షంలో నిర్వహించే కార్యక్రమ సన్నాహాలను సీఎం చంద్రబాబు స్వయంగా సమీక్షిస్తున్నారు. ఆర్కే బీచ్‌రోడ్డు, ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానాలను సందర్శించారు. అనంతరం నోవాటెల్ హెూటల్‌లో మం త్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల తో సమీక్షించారు.




## ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించిన జీ7 దేశాలు

**న్యూఢిల్లీ,జూన్, 17:**ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ యుద్ధ పరిస్థితుల్లో జీ7 దేశాలు (కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్) ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించాయి. కెనడాలోని కననాస్కిస్‌లో జరిగిన జీ7 సదస్సులో ఈ నిర్ణయం తీసుకున్నారు.




# భాషల ఆధారంగా దేశాన్ని విభజించలేం : ధన్‌ఖర్

పుదుచ్చేరి: భారత్ ఆకాంక్షలతో కూడుకున్న దేశమని, భాషల ఆధారంగా విభజన జరగడం సరికాదు అని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్తెలిపారు. దేశ భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని, భాషా వివాదం నుంచి బయటపడాలని ఆయన ప్రజల్ని కోరారు. జాతీయ విద్యా విధానం 2020ని కచ్చితంగా అమలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ విధానం విద్యా వ్యవస్థలో గేమ్‌ఛేంజర్‌గా మారుతుందన్నారు. పాండిచ్చేరి వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కొందరు భాషలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గత దశాబ్దంలో అద్భుతమైన ప్రగతి జరిగిందని, దీని వల్ల భారత్ ఆకాంక్షల దేశంగా మారిందని ఆ యన అన్నారు. భాషల ఆధారంగా ఎలా విభజిస్తారని ఆయన ప్రశ్నించారు. భాషల అంశంలో ఏ దేశం కూడా భారత్ అంత సంపన్నంగా లేవన్నారు. సంస్కృత భాషకు విశ్వవ్యాప్తంగా ప్రాముఖ్యత ఉందని, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, ఒడియా, మరాఠీ, పాలీ, ప్రాకృతి, బెంగాలీ, అస్సామీతో పాటు 11 క్లాసికల్ బాషలు ఉన్నట్లు చెప్పారు. పార్లమెంట్‌లో 22 భాషల్లో చర్చలు చేపట్టేందుకు సభ్యులకు అవకాశం ఉందన్నారు. మన భాషలు సమగ్రతకు నిదర్శనమని, ఐకమత్యం కోసం సనాతనం అదే బోధిస్తుందని ధన్‌ఖర్ తెలిపారు. ఆత్మ పరిశోధన చేసుకోవాలని, తెలుసుకుని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, భాషా వివాదం నుంచి బయటపడాలని అన్నారు. ఎన్ఈపీ పాలసీని అమలు చేయాలని రాష్ట్రాలను కోరారు. మన అబ్బాయిలు, అమ్మాయిలు ఆ లబ్ధిని పొందాలన్నారు. రాజకీయ నాయకులు ఎన్ఈపీ పాలసీకి భంగం కలిగించవద్దు అన్నారు.

## పంచాయతీ ఎన్నికలపై ఆ అనుమానం వద్దు: పొన్నం



**హైదరాబాద్,జూన్ 17,తెలంగాణ దిశ:** స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి పొన్నం కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కొందరు కావాలనే అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. కాగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే సంకల్పంతో ఉన్నదని ఈ విషయంలో ఎవరికీ అనుమానం అవసరం లేదని స్పష్టం చేశారు. ఇవాళ ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం చెన్నరావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో సామాజిక కార్యకర్త కంచె ఐలయ్యసోదరుడు సైన్స్ మనిషి కంచె కట్టయ్య సంస్మరణ సభలో మంత్రి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంచె కట్టయ్య చిత్రపటానికి మంత్రి పూలు వేసి నివాళులు అర్పించారు.

## రాబర్ట్ వాద్రాకు మరోసారి ఈడీ సమన్లు!



**న్యూఢిల్లీ,జూన్, 17:**వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాకు మరోసారి ఈడీ సమన్లు జారీ చేసింది. యూకేకు చెందిన ఆయుధాల వ్యాపారి సంజయ్ భండారీతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో ఈడీ సమన్లు జారీ చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద వాంగ్మూలం నమోదు చేయడానికి బుధవారం ఈడీ ప్రధాన కార్యాలయానికి రావల్సిందిగా ఈడీ నోటీసులో పేర్కొంది. ఈనెల 10న విచారణకు హాజరుకావాలని ఈడీ నోటీసులు ఇచ్చింది. అయితే ఈ నెలాఖరులో విదేశీ పర్యటనకు ముందుగానీ.. తర్వాత గానీ హాజరవుతానని వాద్రా తెలిపారు. తన కుమార్తె గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొనడానికి విదేశాలకు వెళ్తున్నట్లు ఈడీకి తెలియజేశారు. ఇంకా ఎమర్జెన్సీగా హాజరు కావాలంటే వర్చువల్‌గా హాజరవుతానని న్యాయవాది సమాచారం అందించారు. మొత్తానికి ఆయా కారణాలు చెప్పి తప్పించుకున్నారు.



## అమర్‌నాథ్ యాత్రా మార్గాల్లో నో-ఫ్లై జోన్.. జూలై 1 నుంచి అమలు

**న్యూఢిల్లీ,జూన్, 17:**అమర్‌నాథ్ యాత్రపై జమ్మూ–కాశ్మీర్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జూలై 1 నుండి ఆగస్టు 10 వరకు అమర్‌నాథ్ యాత్రా మార్గాలను 'నో–ఫ్లై జోన్'గా ప్రకటించింది. ఈ నిర్ణయం కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ సలహా మేరకు తీసుకున్నట్లు స్థానిక ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో అమర్‌నాథ్ యాత్ర మార్గాల్లో డ్రోన్‌లు, యూఏవీలు, బెలూన్‌లు వంటి ఏవైనా వైమానిక పరికరాల వినియోగం నిషేధించబడిం ది. ఈ ఆంక్షలు పహల్గామ్, బాల్టాల్ మార్గాలకు వర్తిస్తాయని అధికారులు స్పష్టం చేశారు. అయితే, వైద్య తరలింపు, విపత్తు నిర్వహణ, భద్రతా దళాల నిఘాకు సంబంధించిన సందర్భాల్లో ఈ ఆంక్షలు వర్తించవని, దీనికి సంబంధించిన వివరణాత్మక త్వరలో జారీ చేస్తామని అధికారులు క్లారిటీ ఇచ్చారు.

## హృదయవిదారక ఘటన..

# ప్లాస్టిక్ సంచిలో మృతశిశువు..

- బస్సులో 90 కిలోమీటర్లు ప్రయాణం!
- మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లాలో ఘటన
- అంబులెన్స్ సమయానికి రాక గర్భంలోనే శిశువు మృతి
- శిశువు మృతదేహాన్ని ప్లాస్టిక్ సంచిలో తరలించిన వైనం
- 90 కిలోమీటర్లు ప్రయాణించిన నిస్సహాయ కుటుంబం
- ఆరోగ్య వ్యవస్థ నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు



పాల్ఘర్ : మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో వైద్య సేవల లోపం ఓ పసికందు ప్రాణాన్ని బలిగొనడమే కాకుండా, ఆ శిశువు మృతదేహాన్ని ఓ నిరుపేద కుటుంబం ప్లాస్టిక్ సంచిలో 90 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లాల్సిన అత్యంత దయనీయ పరిస్థితి దాపురించింది. ఈ హృదయ విదారక ఘటన మోఖాడ తాలూకాలో చోటుచేసుకుంది. ఈ నెల 11న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోఖాడకు చెందిన గర్భిణి అవిత సఖారాం కవర్‌కు ఈ నెల 11న తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108 అత్యవసర అంబులెన్స్ సేవలకు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ, మధ్యాహ్నం వరకు ఎటువంటి అంబులెన్స్ అందుబాటులోకి రాలేదు. చేసేదేమీలేక వారు సొంతంగా ఓ ప్రైవేటు వాహనాన్ని ఏర్పాటు చేసుకుని ఆమెను ఖోడాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే, ఆలస్యం జరగడంతో పరిస్థితి విషమించిందని భావించిన వైద్యులు ఆమెను నాసిక్‌లోని ఓ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. దురదృష్టవశాత్తూ నాసిక్ ఆసుపత్రికి చేరుకోకముందే గర్భంలోనే శిశువు మృతి చెందింది. అక్కడ అవిత మృత శిశువుకు జన్మనిచ్చింది. తిరిగి వచ్చేటప్పుడు మృత శిశువును తరలించేందుకు కూడా ఆసుపత్రి యాజమాన్యం అంబులెన్స్ సమకూర్చలేదు. దీంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో మరణించిన తమ పసికందును ఓ ప్లాస్టిక్ సంచిలో వేసుకుని సుమారు 90కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చింది. ఈ దుస్థితి పాల్ఘర్‌లోని జవహర్–మోఖాడ ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణ ఎంత దయనీయంగా ఉందో మరోసారి బహిర్గతం చేసింది.

## సెప్టెంబర్ నెలకు శ్రీవారి దర్శనం, వసతి కోటా విడుదల తేదీల ప్రకటన

- జూన్ 18న ఆన్‌లైన్‌లో శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు
- జూన్ 21న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఇతర సేవా టికెట్ల విడుదల
- జూన్ 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, గదుల బుకింగ్
- టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లోనే టికెట్లు బుక్ చేసుకోవాలని సూచన
- ఆగస్టు నెల సేవల కోటా జూన్ 25న విడుదల



**తిరుమల,తెలంగాణ దిశ:** శ్రీవారి భక్తులకు ముఖ్యమైన సమాచారం. సెప్టెం బర్ నెలకు సంబంధించిన శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు మరియు వసతి గదుల కోటా విడుదల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రకటిం చింది. భక్తులు ఈ తేదీలను గమనించి, తదనుగుణంగా తమ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తితిదే సూచించింది. శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు మరియు వసతికి సంబంధించిన టికెట్లను కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని, ఇతర అనధికారిక వెబ్‌సైట్లు లేదా మధ్యవర్తులను ఆశ్రయించవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు విజ్ఞప్తి చేసింది.

**వివరాల్లోకి వెళితే...** శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను జూన్ 18వ తేదీ ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనుంది. ఇ–సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం భక్తులు జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఎలక్ట్రానిక్ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు, జూన్ 20 నుంచి జూన్ 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు నిర్దేశిత రుసుము చెల్లించి తమ టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. జూన్ 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్లను విడుదల చేస్తారు.

# మహిళా సాధికారతకు, నేతన్నల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వం

## - మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు








**రాజన్న సిరిసిల్ల, జూన్ 17, (తెలంగాణ దిశ)** :తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతతో పాటు నేతన్నల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అన్నారు. మంగళవారం మహిళా కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జై బాపు, జై భీమ్, జై సం విధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా సిరిసిల్ల చౌరస్తాలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెంచిన గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలను నిరసిస్తూ నేతన్న చౌరస్తాలో నేతన్న విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం చౌరస్తాలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రూ. 5 లక్షల సహాయంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. అదే విధంగా సిరిసిల్ల బివై నగర్ రేషన్ షాప్ లో సన్న బియ్యం లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. అనంతరం మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్లలోని జిల్లా, బ్లాక్, బూత్ కమిటీ అధ్యక్షురాళ్లు, కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సునీతారావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేయాలని సూచించారు. అదే విధంగా పార్టీని కింది స్థాయి నుంచి మరింత పటిష్ట చేసేందుకు మహిళా కాంగ్రెస్ నేతలు కృషి చేయాలని సూచించారు. చివరిగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం కార్యక్రమంలో భాగంగా సుందరయ్య నగర్ కు చెందిన లబ్ధి దారు మార్గం మంజుల ఇంట్లో సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం సన్న బియ్యం పంపిణీ చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పవర్‌లూమ్, హ్యాండ్లూమ్ మొగ్గాలను సందర్శించారు. ఈ సందర్భంగా నేతన్నలతో మాట్లాడారు. నేత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఆమె వివరించారు. రూ. 5 లక్షల వరకు ముద్ర రుణాలతో పాటు 10 శాతం నూరు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. పొదుపునిది కింద 1200, ప్రభుత్వం నుంచి బల్క్ ఆర్డర్లు, దుస్తుల పార్కు, నేతన్నల భీమా తదితర పథకాలను వివరించారు వీటితోపాటు నేతన్నల పిల్లల కోసం స్కాలర్ షిప్, శ్రీ బీమా యోజన, కామన్ ఫెసిలిటీ సెంటర్ ఇందులో మగ్గం శిక్షణ కేంద్రాలు వంటి వసతులు ప్రభుత్వం చేకూరుస్తుందని వారికి వివరించారు. ఈ ప్రయోజనాలతో పాటు ఆర్థిక సహాయం, బీమా పథకాలు, ఫ్యాబ్రిక్ ఉత్పత్తికి ప్రభుత్వ ఆర్డర్లు ఉన్నాయని, ఇవి నేతన్నల జీవనోపాధితో పాటు ఈ ప్రాంతంలో పవర్‌లూమ్ పరిశ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో ఉన్నాయని తెలిపారు.

## చనిపోయిన భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి నష్టపరిహారం



**కుత్బుల్లాపూర్, జూన్ 17, (తెలంగాణ దిశ)** :ప్రవేట్ కంపెనీలో కూలీ పని చేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబానికి నష్టపరిహారం కింద రూ. 8 లక్షలను బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు రవి జోక్యంతో మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. మేడ్చల్ నియోజకవర్గం శామీర్ పేట్ మూడు చింతల పల్లి గ్రామంలోని వెంకట సాయి ప్రవేట్ లిమిటెడ్ కంపెనీలో గత కొన్ని రోజుల నుంచి భవన నిర్మాణ కార్మికుడు శివ పని చేసేవాడు.
. అక్కడ పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మరణించాడు. బాలనగర్ ఇంద్రనగర్ కాలనీలో నివసించే కుటుంబ సభ్యులు కార్మిక నాయకుడు రవీని సంప్రదించారు. దీంతో ఆయన వెంకట సాయి ప్రవేట్ లిమిటెడ్ కంపెనీ యజమాన్యంతో చర్చించి నష్టపరిహారం కింద రూ. 8 లక్షలు చెక్కు రూపంలో శివ కుటుంబ సభ్యులకు ఇప్పించారు. ఈ సందర్భంగా శివ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర నగర్ కాలనీ అధ్యక్షులు గిరి, చక్రి, అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టే ప్రాంతాలను పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్



**నాగారం, జూన్ 17, (తెలంగాణ దిశ)** :నాగారం మున్సిపాలిటీ పరిధిలోని బిఎంఆర్ కాలనీలో హెచ్ఎండిఎ నిధులు రూ. 9 కోట్ల 90 లక్షలు బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టే ప్రాంతాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరిశీలించారు. వర్షాలు పడుతున్న సందర్భంలో పైనుంచి వస్తున్న నీరు కారణంగా కీసర నాగారం ప్రధాన రహదారిపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతున్న విషయం విధితమే. మంగళవారం ఈ ప్రాంతాన్ని ఈటల రాజేందర్ పరిశీలించారు. బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, అన్నంరాజు సురేష్, నక్కకిషోర్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక భారం ఉన్న పేదల సంక్షేమం

## - ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం
## - డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వెల్లడి




మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 17, (తెలంగాణ దిశ) : ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థికంగా సంక్షేమ పథకాలు ప్రభుత్వానికి పెను భారమైన పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రగతి కోసం పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ఎట్టి పరిస్థితుల్లో అమలు చేస్తామని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి మంగళవారం షామీర్ పేట్ లోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ లో 805 మంది లబ్ధిదారులకు రూ. 8 కోట్ల 5 లక్షల 95 వేల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసారు. ఇందులో భాగంగా మేడ్చల్ లో 139 మందికి కోటి 40 లక్ష లు, షామీర్ పేటలో 71 మందికి 71 లక్ష 8వేల 236, మూడు చింతలపల్లి మండలానికి చెందిన 27 మందికి 27 లక్షల 3 వేల 132, కీసర మండలానికి చెందిన 136 మందికి కోటి 36 లక్షల 15 వేల 776, కాప్రా –జవహర్ నగర్ చెందిన 81 మంది లబ్ధిదారులకు 81 లక్షల 9వేల 396, ఘట్కేసర్ మండలానికి చెందిన 131 మంది లబ్ధిదారులకు కోటి 31 లక్ష ల 15 వేల 196, మేడిపల్లి మండలానికి చెందిన 220 మందికి 2 కోట్ల 20 లక్షల 25వేల520 రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ఎన్నికల నాటి హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి రాష్ట్రంలోని రైతాంగానికి రైతు భరోసా కింద ఎకరాకు రూ. 12 వేల ఆర్థిక సహాయాన్ని సీఎం ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా తొలి విడతగా ఎకరాకు రూ. 6000 ఇచ్చామని చెప్పారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లాలో



3656 మంది రైతులకు కోటీ 72 లక్షలు, రంగారెడ్డి జిల్లాలోని 1,54,62 మంది రైతులకు రూ. 81 కోట్ల 35 లక్షలు అలాగే వికారాబాద్ జిల్లాలోని 1,62,000 మంది రైతులకు రూ. 99 కోట్ల రైతు భరోసా అందిస్తున్నామని మహేందర్ రెడ్డి వెల్లడించారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం లాంటి వాటికి సీఎం రేవంత్ రెడ్డి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నారని వెల్లడించారు. ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకుంటామని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహేందర్ రెడ్డి సూచించారు. ప్రతిపక్షాలు విమర్శలు తగ్గించి, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు.

# బడికి బాట చూపిన "హైడ్రా"

## - ధన్యవాదాలు తెలిపిన చిన్నారులు





**సికింద్రాబాద్, జూన్ 17, (తెలంగాణ దిశ)** :మా బడికి బాట చూపారంటూ... హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు సికింద్రాబాద్‌లోని మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట రమణలతో కలిసి వచ్చిన విద్యార్థులు హైడ్రా కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి మొక్కను బహూకరించారు. మే నెల 26 వ తేదీన జీహెచ్ ఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రెడ్డి సీఎం గారు.. మా బడికి బాట వేయించండి అంటూ ప్ల కార్డు పట్టుకుని ధర్నాకు దిగిన విషయం మీడియాలో ప్రసారమవ్వడంతో హైడ్రా రంగంలోకి దిగింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఆదిత్య క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. పాఠశాలకు వెళ్లే మార్గంలో అడ్డంగా ఉన్న ప్రహరీని తొలగించిన విషయం విధితమే. జీహెచ్ ఎంసీ సహకారంతో అక్కడ రోడ్డు వేయించి.. పాఠశాలకు గేటు కూడా పెట్టించారు. అప్పుడే విద్యార్థులు పాఠశాలలో సంబరాలు చేసుకున్నారు. హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు. హైడ్రాను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జైకొట్టారు. మంగళవారం నేరుగా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మీరంతా బాగా చదువుకోవాలని కమిషనర్ చెప్పగానే అందరూ ముక్తకంఠంతో ఓకే సార్ అన్నారు. పాఠశాలకు రోడ్డు వేయించి గేటు పెట్టించిన జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు కూడా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ జన్మదిన వేడుకలు






**కుత్బుల్లాపూర్, జూన్ 17, (తెలంగాణ దిశ)** :మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానుల మధ్య కోలాహలంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఆయనను పలువురు ఘనంగా సన్మానించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కూన శ్రీశైలం గౌడ్ జన్మదిన వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి, మేడ్చల్ కార్యదర్శి శోభ రాణి, శైలజ, సహాయ కార్యదర్శి సరస్వతి, 128 డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఎన్ వి కమలతో పాటు పలువురురాజకీయ ప్రముఖులు, పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, జిల్లా పరిషత్ నాయకులు, బీసీ, ఎస్ సి, ఎస్ టి, మైనారిటీ సెల్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ యుఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు కేక్ కట్ చేయించి శాలువాలతో సత్కారించి బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# చర్లపల్లి డివిజన్ లో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలి

**చర్లపల్లి, జూన్ 17, (తెలంగాణ దిశ)** :చర్లపల్లి డివిజన్ లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ఎల్ బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్. కేశవ్ పాటిల్ ను కోరారు. ఈ మేరకు చల్లపల్లి డివిజన్ టిఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటీవల చర్లపల్లి డివిజన్ లో పర్యటించినప్పుడు స్థానికులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అదేవిధంగా వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ కాలనీలో సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.



# వరంగల్ జిల్లా జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ

## - వరంగల్ జిల్లా కలెక్టర్, డీఈఓ కు కృతజ్ఞతలు తెలియజేసిన టీఎస్ జెయు

**వరంగల్, జూన్ 17, (తెలంగాణ దిశ)** :జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని టీఎస్ జెయు వరంగల్ జిల్లా నాయకులు జిల్లా కలెక్టర్ ను కోరారు. ఇందుకు తక్షణమే జిల్లా కలెక్టర్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీని కల్పించాలంటూ వరంగల్ జిల్లా డిఈఓ ను ఆదేశించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం వరంగల్ డీఈఓ ఎం. జ్ఞానేశ్వర్ జర్నలిస్ట్ పిల్లలకి రాయితీ కల్పిస్తూ ప్రొసీడింగ్ కాపీని టీఎస్ జెయు నాయకులకు అందజేశారు.
ఈ సందర్భంగా టీఎస్ జెయు వరంగల్ జిల్లా నాయకులు వరంగల్ జిల్లాలో



పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ప్రొసీడింగ్ కాపీని ఇవ్వడం పట్ల వరంగల్ జిల్లా కలెక్టర్, డీఈఓలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సంపాదకీయం

## జలవిలయాల ప్రభావం తగ్గించలేమా?

కేరళలో వయనాడ్‌లో ఆకాశం బద్దలైంది. కొండలు కూలిపోయాయి. ఊళ్లు నామరూపాలు లేకుండా పోయాయి. 392 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ ఏ రోజుకారోజు కేరళ వరదలు సృష్టించిన విధ్వంసం తాలుకూ చేదు జ్ఞాపకాలు ఏదో ఒక రూపంలో స్థానికుల్ని వెంటాడుతునే ఉన్నాయి. నిలువ నీడ లేకుండా మిగిలిన పోయిన కుటుంబాల ఇప్పట్లో తేరుకునేలా కనిపించడ లేదు. యావత్ దేశం కేరళను ఆదుకునేందుకు ముందుకొచ్చింది.ఆగస్ట 2024 వర్షాలు స్టిల్ కంటిన్యూ? అయినా వర్షాకాలం వర్షాలు కాక.. ఎండలు కాస్తాయా అన్న వాళ్లు లేకపోలేదు. కానీ ఈ వర్షాలు వర్షాకాలం వర్షాల్లా కురిస్తే.. మనం ఇంత ఘనం మాట్లాడుకోవాల్సిన పని లేదు. మహారాష్ట్రను ముంచేసింది. ముంబై మహానగరం కూడా వర్షాలకు అల్లాడిపోక తప్పలేదు. ఆ పై గుజరాత్‌ను గజగజలాడించాయి. ఇప్పటికే మూడు పదులకుపైగా ప్రాణాలు పోయాయి. సుమారు 20 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే ఈ ఏడాది నైరుతి ముందే వచ్చినా వర్షాలు ఆలస్యమయ్యాయి. జూలై 3-4 వారాల వరకు పెద్దగా వర్షాల జాడే లేదు. ఎగువన కర్నాటక, మహారాష్ట్రాలలో కురిసిన వర్షాల ధాటికి క్రమంగా ప్రాజెక్టులు నిండటం మొదలైంది. ఆపై తెలుగు రాష్ట్రాల్లోనూ వరణుడు కరుణించడంతో నాలుగైదు రోజుల క్రితం వరకు అన్ని ప్రాజెక్టులు కళకళలాడుతూ కనిపించాయి. ఆగస్టు కూడా ముగిసి సెప్టెంబర్ వస్తూ ఉండటంతో.. ఈ ఏడాదికిక వర్షాలు సరిపోతాయనుకున్నారంతా.. బట్?జూలై 30 కేరళను అతలాకుతలం చేసేస్తే? సరిగ్గా నెల రోజుల్లో అంటే ఆగస్టు 30-31 తెలుగు రాష్ట్రాలను ముంచేశాడు వరుణుడు. ఇప్పటికి ఎన్ని సార్లు వాయుగుండాలు రాలేదు.. అయినా.. ఈ వాయుగుండం సృష్టించినంత విలయం బహశా.. గడిచిన కొన్నేళ్లలో ఎప్పుడూ జరగలేదేమో.. ఎక్కడో ఉత్తరాంధ్రలో కళింగపట్నం దగ్గర తీరం దాటిన వాయుగుండం కృష్ణా, గుంటూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాలలో ఇంత బీభత్సం సృష్టిస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. నిజానికి వాయుగుండం తీరం దాటిన శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం ప్రాంతంలో మాములూ వర్షమే పడింది. పెద్దగా ఈదురు గాలులు కూడా లేవు. దీంతో అక్కడ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కానీ అంతంత మాత్రం ప్రభావం ఉ ంటుందనుకున్న కృష్ణా-గుంటూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోనూ ఇటు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మాత్రం రికార్డు స్థాయి వర్షాలు నమోదయ్యాయి వాయుగుండం తీరం దాటిన ప్రాంతంలోనే దాని ప్రభావం ఉంటే.. ఈ స్థాయిలో ఆస్తినష్టం సంభవించి ఉండేది కాదు. ఎందుకంటే తీరం దాటిన ప్రాంతంలో విజయవాడ నగరం.. దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉండేంత జన సాంద్రత ఉండదు. ఇళ్లు, భవనాలు కూడా ఉండవు. పైగా ఆ ప్రాంతంలో ఉన్నవన్నీ గ్రామాలే. కానీ వాస్తవం వేరుగా ఉంది.విజయవాడ-గుంటూరు-ఖమ్మం-నల్గొండ.. ఈ ప్రాంతాల్లోనే కాదు.కానీ రెండు రాష్ట్రాల్లోని ఆ నాలుగు జిల్లాల్లో ఉన్న ప్రభావం తెలంగాణలోని మిగిలిన జిల్లాల్లో లేదు. అటు ఏపీలోని విజయవాడ-గుంటూరు, ఇటు తెలంగాణలో ఖమ్మం-నల్గొండ.. ఈ నాలుగు జిల్లాలు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న జిల్లాలు. అలాగే హైదరాబాద్ మహానగరాన్ని ఏపీతో కలిపే జిల్లాలు. దీంతో ఆ నాలుగు జిల్లాల్లో కురిసిన వర్షాలు, అక్కడ సంభవించిన వరదల వల్ల ప్రభావితమైన ప్రజల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ఖమ్మం, నల్గొండలో కురిసిన వర్షాల ధాటికి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారులు నీటి మునిగాయి. దీంతో రాకపోకలకు బ్రేక్ పడింది. కేవలం విజయవాడ-హైదరాబాద్ రోజుకి సుమారు 24వేల వాహనాలు తిరుగుతాయి. దీంతో గడిచిన 24 గంటలుగా అక్కడ రాకపోకలు స్తంభించడంతో రెండు రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు రైల్వే లైన్లు కూడా దెబ్బతినడంతో విజయవాడ మీదుగా నడిచే 130 రైళ్లను రద్దు చేశారు. విజయవాడ-హైదరాబాద్‌ల మధ్య కె సముద్రం వద్ద రైల్వేట్రాక్ దెబ్బతినడంతో చాలా రైళ్లపై ప్రభావం పడింది.ఏపీలో విజయవాడ పరిస్థితి అలా ఉంటే.. తెలంగాణ రాష్ట్రానికొస్తే.. ఇక్కడ ఖమ్మం జిల్లాపై ఆ స్థాయిలో ప్రభావం పడిందని చెప్పొచ్చు. శనివారం రాత్రి ఖమ్మం నగరంలో కురిసిన వర్షం ధాటికి జనం అల్లాడిపోయారు. చాలా ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. దానికి తోడు మున్నేరు వాగు పొంగడంతో కట్టుబట్టలతో జనం మిగిలిపోయిన పరిస్థితి నెలకొంది. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సెల్ టవర్లు పని చెయ్యలేదు. కొన్ని ప్రాంతాల్లో ఊరేదో.. చెరువేదో.. నది ఏదో కూడా తెలుసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఖమ్మం-హైదరాబాద్ జాతీయ రహదారి కొట్టుకుపోయింది. పాలేరు వరద ఉధృతికి కూసుమంచి దగ్గర హైవే ధ్వంసమైంది. మంత్రి పొంగులేటి నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో వరదలో చిక్కుకున్నాయి. జనం కట్టుబట్టలతో మిగిలిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. భద్రచాలం వద్ద గోదావరికి గతంలో సెప్టెంబర్ నెలలో కూడా వరదలు ముంచెత్తిన చరిత్ర ఉండటంతో స్థానికులు భయం భయంగా కాలం గడుపుతున్నా రు.జులై-ఆగస్టు.. రెండు నెలలు కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు తీరని వ్యధను మిగిల్చాయి. మరి సెప్టెంబర్ సంగతేంటి..?ఈ నెలలో పరిస్థితి ఎలా ఉండబోతోం ది..? గడిచిన 2 నెలలు చూసిన తర్వాత సహజంగానే అందరి దృష్టి ఈనెలపైనే ఉంది. గడిచిన ఐదేళ్లలో సెప్టెంబర్లోను తుపా నులు బీభత్సం సృష్టించాయి. 2018లో ఒడిషాలో, 2021లో గుజరాత్, ఏపీ, ఒడిషా రాష్ట్రాల్లో వర్షాలు వణకుపుట్టించాయి. తాజా పరిస్థితిని చూసిన తర్వాత ఇప్పుడు సెప్టెంబర్లో ఏం జరుగుతుందా అన్న భయం నెలకొంది. అదే సమయంలో తాజాగా భారత వాతావరణ శాఖ దాదాపు అలాంటి వార్తనే అందించింది.దేశం మొత్తం మీద ఆగస్టు నెలలో రికార్డు స్థాయిలో 16శాతం అదనంగా వర్షాలు పడ్డాయి. దాదాపు ఇదే పరిస్థితిఈ నెలలో కూడా ఉ ండొచ్చన్నది ఐఎండీ అంచనా. చాలా చోట్ల రుతుపవనాల ప్ర భావంతో సాధారణ వర్షపాతాలే నమోదవు తాయని వెల్లడిం చింది. అయితే ఉత్తరాఖండ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో మాత్రం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నది వాతావరణ శాఖ తాజా హెచ్చరిక. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలలో భారీగా వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని కూడా వార్నింగ్స్ ఇచ్చింది. ప్రస్తుతానికి దేశంలోలా నినా ప్రభావం ఇంకా పూర్తిగా ముగియలేదన్నది ఐఎండీ చెబుతున్న మాట.

# స్పీడ్ బ్రేకర్లు.. రోడ్డు కట్టింగులు..

## రోడ్ల మూసివేతలు ఏ అంతా మా ఇష్టం...

### కాలనీలలో అడ్డగోలుగా వెలుస్తున్న స్పీడ్ బ్రేకర్లు.., పట్టించుకోని అధికారులు...








**కాప్రా, జూన్ 17, (తెలంగాణ దిశ) :** కాప్రాలో స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు కటింగ్ లు, రోడ్ల మూసివేతలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు నిమ్మకు నీరేతినట్లు ఉండడంతో కాలనీలలో ఎవరికి వారే యమునా తీరే అన్న విధంగా తయారయింది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులలో సైతం స్పీడ్ బ్రేకర్లు వేస్తున్న అడిగే నాధుడే లేకుండా పోయాడు. దీనికి తోడు ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వి పైప్ లైన్లు, డ్రైనేజీలు వేస్తున్న పట్టించుకునే నాధుడే లేడు. అదేవిధంగా ఇంటి నిర్మాణం సందర్భంగా రోడ్లను మూసివేస్తున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆయా కాలనీలలో స్థానికులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లను బ్లాక్ చేయడం ఏమిటని ప్రయాణికులు అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారు. ముఖ్యంగా స్పీడ్ బ్రేకర్ల వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్డగోలు స్పీడ్ బ్రేకర్ నిర్మాణాలపై జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ లాభం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా జరుగుతున్న రోడ్డు కట్టింగుల గురించి పట్టించుకునే నాధుడే లేకపోవడంతో రోడ్లు వేసిన కొన్ని రోజులకే తవ్వకాలు జరుగుతున్నాయి. ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించని సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల నేతాజీ నగర్ చౌరస్తా తో పాటు కాప్రా ఆదిత్య నగర్ లో రోడ్డును తొవ్వినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు. రోడ్డు తవ్వకానికి వేసిన అపరాధ రుసుంను సైతం వసూలు చేయడంలో జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా నార్త్ కమలానగర్ లో ఇష్టా రాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు ను ఏర్పాటు చేశారు. రాత్రికి రాత్రి రోడ్లను బ్లాక్ చేసి స్పీడ్ బ్రేకర్లను నిర్మిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. 100 మీటర్లకు ఒక స్పీడ్ బ్రేకర్ చొప్పున నిర్మించి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతోపాటు ఏఎస్ రావు నగర్ డివిజన్ భవాని నగర్ లో సైతం అక్రమంగా స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. చర్లపల్లి డివిజన్ వివిఎస్.రెడ్డి నగర్ లో నిర్మించిన స్పీడ్ బ్రేకర్లపై అనేక విమర్శలు వచ్చినప్పటికీ అధికారుల్లో స్పందన కనిపించలేదు.స్పీడ్ బ్రేకర్ల నిర్మాణంలో కనీస ప్రమాణాలు పాటించకపోవడంతో పాటు ఎత్తుగా నిర్మించడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకొని స్పీడ్ బ్రేకర్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా రోడ్డు కటింగ్ లతో పాటు రోడ్డు బ్లాక్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## గాజులరామారంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి

# కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి













**కుత్బుల్లాపూర్, జూన్ 17, (తెలంగాణ దిశ) :** గాజుల రామారంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆశాజ్యోతి ఉమెన్ నెట్ వర్క్ అధ్యక్షురాలు మల్యాల రమణి మంగళవారం కుత్బుల్లాపూర్ తహసిల్దార్ కు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. సర్వే నంబర్ 445 చూపిస్తూ ప్రభుత్వ సర్వే నెంబర్ 12 గాజుల రామారంలో ప్రభుత్వ భూమి రెండు ఎకరాల కబ్జా చేసిన జానకి రామయ్య పై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆమె కోరారు. ప్రభుత్వ భూమిలో జానకి రామయ్య అనే వ్యక్తి దాదాపు రెండు ఎకరాలు కబ్జా చేసుకుని దర్జాగా చిన్న చిన్న షెడ్లు నిర్మించడమే కాకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణం చేసుకొని తప్పుడు డాక్యుమెంట్లతో ప్రైవేట్ పట్టా భూమిగా చూపిస్తూ అమ్మకాలు చేయడమే కాకుండా కోర్టు కూడా తప్పుడు పత్రాలు సమర్పిస్తూ ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా హైకోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు పొందడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. ఈ విధంగా జానకి రామయ్య అనే వ్యక్తి ప్రభుత్వ భూములలో నిర్మించిన అక్రమ కట్టడాలకు పక్క సర్వే నెంబర్లు చూపిస్తూ కబ్జా చేస్తున్నారని వివరించారు. అంతే కాకుండా తప్పుడు డాక్యు మెంట్లతో కబ్జా చేసుకొని అధికా రులు చర్యలు తీసుకోకుండా కోర్టు ఉత్తర్వులు తెచ్చుకున్నారని అన్నారు. దాదాపు రెండు ఎకరాలు 50 కోట్ల విలువ గల సర్వే నెంబర్ 12 లో ప్రభుత్వ భూమి కబ్జాపై కుత్బుల్లాపూర్ మండల అధికారులు చర్యలు తీసుకోకుండా జానకి రామయ్య పనితనం చూస్తే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. ఈ విధంగా సర్వే నెంబర్ 445 ప్రైవేట్ పట్టా భూమిగా చూపిస్తూ సర్వే నెంబర్ 12 లో దాదాపు రెండు ఎకరాల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కబ్జా చేసి తప్పుడు పత్రాలతో ప్రభుత్వంగా చూపిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## ఏసీబీ ట్రాప్ లో జిహెచ్ఎంసి చర్లపల్లి ఏఈ స్వరూప

# స్వరూప లంచం డిమాండ్ వెనక గ(పె)ద్దలు..!?

### కాప్రా ఇంజనీరింగ్ విభాగంలో విలయ తాండవం చేస్తున్న అవినీతి



**కాప్రాజూన్ 17, (తెలంగాణ దిశ) :** జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. స్వరూప ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.1.20 లక్షలు లంచం తీసుకుంటుండగా మంగళవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. రామ్ రెడ్డి అనే కాంట్రాక్టర్ కు రూ. 28 లక్షల బిల్లులు (ఎంబి చేసేందుకు) మంజూరు చేసేందుకు ఏఈ స్వరూప రూ. రెండు లక్షల డిమాండ్ చేశారు. చివరికి రూ.1.20 లక్షల లంచం ఇవ్వడానికి ఇరువురు మధ్య అంగీకారం కుదిరింది. దీంతో కాంట్రాక్టర్ రామ్ రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు కాప్రా మున్సిపల్ కార్యాలయం గేటు లోపల ఏఈ స్వరూపను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ. 1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా ఏఈ స్వరూప కాంట్రాక్టర్లను లంచాల కోసం వేధింపులకు గురి చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనతో జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవినీతి మరో సారి బట్టబయలైంది. ఈ మేరకు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేసినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1064లో సంప్రదించాలని ఏసీబీ అధికారులు కోరారు. అదే విధంగా సోషల్ మీడియా సాధనాలైనా వాట్సప్ నెంబర్ 94404 46106, ఫేస్ బుక్ (తెలంగాణ ఎసిబి), ఎక్స్ ఎట్ ది రేట్ ఆఫ్ తెలంగాణఎసిబి లలో సంప్రదించ వచ్చునని సూచించారు. ఇదిలా ఉండగా ఏఈ స్వరూప డిమాండ్ చేయడం వెనుక గ(పె)ద్దల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ లోని ఇంజనీరింగ్ విభాగం లో పెద్ద ఎత్తున జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఇప్ప చెట్ల జన్యుపరమైన మెరుగుదలపై శిక్షణ





**కుత్బుల్లాపూర్,జూన్ 17, (తెలంగాణ దిశ) :** బహదూర్ పల్లి లోని అటవీ జీవ వైవిధ్య సంస్థ సీఐఎఫ్ బి ఆధ్వర్యంలో మంగళవారం అటవీ అధికారులకు ఇప్ప చెట్ల జన్యుపరమైన మెరుగుదల, ఉప ఉత్పత్తులను పెంపొందించడం అనే అంశంపై ఏఐసిఆర్ పి 23 ప్రాజెక్టులో భాగంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్ఎస్ఈ. వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్ప చెట్ల యొక్క ప్రాముఖ్యత, ఉత్పత్తులు, ఆవశ్యకత గురించి తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా అటవీ అధికారులకు ఐఎఫ్ బి శాస్త్రవేత్తలు ఇప్ప చెట్ల యొక్క ప్రాముఖ్యత, ఉపయోగాలు, ఔషధ విలువలు, ఉత్పత్తులు, జీవనోపాధి, జన్యుపరమైన మెరుగుదల విలువల సంకలనం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్యంగా ఇప్ప ముక్కలతో అంటు, కట్టు పద్ధతులు, వాటి ఉపయోగాలతో పాటు ప్రయోగాత్మకంగా అడవి అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో 60 మంది అటవీ బీట్ అధికారులు పాల్గొన్నారు.

# ఉక్కు'ను ఏర్పాటు చేసేంత వరకూ పోరాడుతాం: సిపిఎం

ప్రొద్దుటూరు కరువు సీమ రాయలసీమకు వెలుగు నింపాల్సిన కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రశ్నించారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో సిపిఎం పట్టణ 3వ మహాసభ ముంతాజ్‌బేగం, పక్కీరయ్య అధ్యక్షతన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వెనుబడిన రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడప జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన సెయిల్ ఆధ్వర్యంలో భారీ సమగ్ర ఉక్కు పరిశ్రమను నిర్మించి ప్రత్యక్షంగా పరోక్షంగా ఒక లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు. రాయలసీమలోని కరువులు వలసలు నివారించాలని పార్లమెంట్ రాష్ట్రపతి ఆమోదంతో చట్టంలోని 13వ షెడ్యూల్‌లో పొందుపరచినప్పటికీ అమలు చేయకుండ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాటివేస్తూ మాయమాటలు చెబుతూ వస్తున్నాయని విమర్శించారు. సిఎం చంద్రబాబు గతంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డివి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని టిడిపి ఎంపీ సీట్లపై ఆదారపడి ఉందని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించేందుకు కృషిచేయాలని డిమాండ్ చేశారు. కడప–బెంగుళూరు రైల్వేలైన్ 20ఏళ్లుగా 20 కి.మీలు మాత్రమే పూర్తి చేశారని మిగతా రైల్వే లైన్ పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని తెలుగుగంగ, గాలేరు–నగిరి, హంద్రీ–నీవా, వెలిగొండ ప్రాజెక్టల పరిధిలోని రిజర్వాయర్ల పంట కాలువలు పూర్తి చేయాలని పేర్కొన్నారు.



కడప జిల్లాలో కరువు మండలాలు ప్రభుత్వం ప్రకటించకపోవడం వ్యవసాయాధికారుల నిర్లక్ష్యమే కారణంగా భావించాలన్నారు. మహాసభల ప్రారంభానికి ముందు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ నాయకులు పక్కీరయ్య జెండా ఆవిష్కరణ చేశారు. మహాసభల్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, ప్రొద్దుటూరు పట్టణ కమిటీ సభ్యులు కె.సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజాసమస్యలే అజెండాగ భవిష్యత్తులో ఆందోళన పోరాటాలు నిర్వహించాలని అనేక తీర్మానాలు మహాసభల్లో స్థానిక నాయకత్వం ప్రవేశపెట్టి మహాసభ ఆమోదించింది.

# స్థలం సమకూరితే..వ్యర్థాల సమస్యకు చెక్



అమలాపురం : 'రాష్ట్ర వ్యాప్తంగా ఏ పట్టణంలో చూసినా చెత్త కొండలా దర్శనమిస్తోంది. దానిని శుభ్రం చేయడానికి సుమారు రెండేళ్లు పడుతుందని ఉన్నతాధికారులు, మంత్రులు, చెబుతున్నారు. సుమారు రూ.వెయ్యి కోట్లు ఖర్చవుతుందంటున్నారు. ఎంత వ్యయమైనా ఏడాదిలోగా పురపాలికల్లోని చెత్తను తొలగించాలని ఆదేశాలు ఇచ్చాం..' అని గాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అయిదేళ్ల వైకాపా పాలనలో ప్రజల నుంచి చెత్త పన్ను ముక్కు పిండి మరీ వసూలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. తడిచెత్త, పొడిచెత్త సేకరించలేక పోయారు. పట్టణాల ద్వారా వెళ్తున్న మురుగు కాలువలు సైతం వ్యర్థాలతో నిండిపోయాయి. పట్టణం పరిధిలో చెత్త నిల్వ చేస్తున్న డంపింగ్ యార్డులోని చెత్త నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా యార్డును ఖాళీ చేసేందుకు రెండేళ్ల క్రితంఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పురపాలక సంఘం నుంచి నిధులు కేటాయించారు. ఈప్రాజెక్టు విలువ రూ.2 కోట్లు. 75 శాతం బిల్లులు చెల్లించారు. కొంత చెత్తను వేరే చేసినా, ఇప్పటి వరకు డంపింగ్ యార్డు నుంచి తరలించలేదు.

అమలాపురం డంపింగ్ యార్డులో వేరుచేసిన వ్యర్థాలను తరలించేందుకు గుత్తేదారు సంస్థలకు కొన్ని నెలల పాటు సమయం పొడిగించారు. రోజూ సేకరించే చెత్త వేసేందుకు యార్డు పక్కన రైతులు స్థలం ఇచ్చేందుకు 2018లో అంగీకారం తెలిపారు. సంప్రదింపులు జరుపుతున్నాం. వారు భూములిస్తే సమస్య కొలిక్కి వస్తుంది.

## చిరుద్యోగులపై రాజకీయ కక్షలు తగవు

మార్కాపురం :చిరుద్యోగులపై రాజకీక కక్షలు తగవని, విధుల నుంచి తొలగించిన 21 మంది మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య డిమాండ్ చేశారు. కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు గత 22 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. రిలే దీక్షలను సోమయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నాయకులు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. 20 ఏళ్లకుపైగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను రాజకీయకక్ష సాధింపుతో విధుల నుండి నిలిపివేయడం మంచి పద్ధతి కాదని విమర్శించారు. వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కె.సుబ్బరాయుడు కార్మికులు గొట్టం హరికృష్ణ, షేక్ షబ్బీర్, పాల్వాది శీను, కనకయ్య, అబ్దుల్ హసిద్, హుస్సేన్, తప్పెట్ల శేషులు తదితరులు పాల్గొన్నారు.


# జీజీహెచ్‌లో మూలకు చేరిన వెంటిలేటర్లు

రాజమహేంద్రవరం వైద్యం: ఎంసీయూలో ఒకటి.. క్యాజువాలిటీలో మూడు..ఇదీ జీజీహెచ్‌గా మారి రెండేళ్లయిన రాజమహేంద్రవరం ఆసుపత్రిలో వెంటిలేటర్ల పరిస్థితి. పదుల సంఖ్యలో వెంటిలేటర్లు మరమ్మతులకు గురై మూలకు చేరినా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో అత్యవసర చికిత్సకు వచ్చేవారికి చిక్కులు తప్పడం లేదు. రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి నిత్యం పది మంది వరకు రోగులు అత్యవసర పరిస్థితుల్లో వస్తుంటారు. అందులో కొందరికి వెంటిలేటర్ అవసరం ఉంటుంది. తీవ్ర అస్వస్థతకు గురై అత్యవసర పరిస్థితుల్లో వెంటిలేటర్‌పై ఆసుపత్రికి వచ్చేవారికి పూర్తిస్థాయి వైద్య సేవలు అందడం లేదు. అలాంటి కేసులను కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా వెంటిలేటర్‌పై వైద్యమంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. పేద, మధ్యతరగతి ప్రజలకు జీజీహెచ్‌లో వెంటిలేటర్‌పై అందించే వైద్యం ఓ వరంలాంటిది. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందక.. ప్రైవేటుకు వెళ్లలేక రోగులు నరకయాతన పడుతున్నారు. జీజీహెచ్‌లో వందకు పైగా వెంటిలేటర్లున్నాయి. ప్రస్తుతం హైబ్రిడ్ ఐసీయూ, ఎంఐసీయూ, క్యాజువాలిటీ కలిపి పదిలోపే పనిచేసేవి ఉన్నాయి. పనిచేయని వాటిని అలానే వదిలేశారు. హైబ్రిడ్ ఐసీయూ వద్ద గదిలో పదుల సంఖ్యలో వెంటిలేటర్లు అలాగే వదిలేశారు. తుప్పుపట్టి ఉన్నాయి. ఎన్ని మరమ్మతులకు గురయ్యాయో.. ఎన్ని పనిచేసేవి ఉన్నాయో తెలియని పరిస్థితి. క్యాజువాలిటీలో వెంటిలేటర్ కేసులు మూడుకంటే



ఎక్కువ వస్తే ఇక అంతే సంగతులు. పాత కేసులను ఐసీయూలోకి మార్చి కొత్త కేసుకు వెంటిలేటర్ పెట్టాలి. ఐసీయూలోనూ కొన్నే పనిచేస్తున్నాయి. పనిచేయని వాటికి మరమ్మతులు చేసేందుకు తగిన సిబ్బంది ఉన్నా వాటిని అందుబాటులోకి తెచ్చి ఎందుకు వినియోగించడం లేదో అర్థంకాని పరిస్థితి. జీజీహెచ్‌కు ఒక బయో మెడికల్ ఇంజినీరు, నలుగురు టెక్నీషియన్లు ఉన్నారు. వందకు పైగా ఉన్నవాటికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తే రోగులకు మేలు చేకూరుతుంది. సమస్యను ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆక్సిజన్ ఎక్కువ ఫ్లో అవసరమైనవారికి మాత్రమే ఉపయోగపడతాయని.. సాధారణంగా వెంటిలేటర్ కేసులకు ఇవి పూర్తిస్థాయిలో పనిచేయవని చెప్పారు.

# చేపలరేవు అన్నారు.. చేతులెత్తేశారు



కాకినాడ: వైకాపా ప్రభుత్వం మత్స్యకార ఓటు బ్యాంకు కోసం చేపల రేవును ఎరగా చూపి ఆశల వల విసిరింది. ఇదిగో.. అదిగో.. అంటూ అయి దేళ్లు గడిపేసింది.. ఎన్నికల ముందు వరకు ఊరించి పూర్తిచేయలేక చేతులెత్తేసింది. అవసరమైన భూమి పూర్తిస్థాయిలో కేటాయించకపోవడం, నిధులూ విదల్చకపోవడంతో పడకేసింది. ప్రాజెక్టు పూర్తవుతుందని, జీవన చిత్రం మారుతుందని ఎదురుచూసిన వేలాది మత్స్యకార కుటుంబాలకు నిరాశే మిగిలింది. దీంతో ఈ ప్రాజెక్టు పూర్తిచేసి భరోసా ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం భుజాన వేసుకుంది. ఎక్కడ: ఉప్పాడ కొత్తపల్లి మండలంలోని అమీనాబాద్ తీరంలో చేపల రేవు నిర్మాణ పనులకు 2020 నవంబర్‌లో మత్స్యకార దినోత్సవ్వ రోజున అప్పటి సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తిచేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. ఏమైంది?: ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు పర్యవేక్షణలో మొదలైన ఈ పనులు 2023 మార్చి నాటికి పూర్తిచేయాలి. కానీ సాధ్యం కాలేదు. జెట్టీ, ఫిష్ హ్యాండ్లింగ్, వేలం ప్రాంగణం, ట్యూనా ఫిష్ హ్యాండ్లింగ్, ప్యాకింగ్, చేపలు ఎండబెట్టే యార్డు, మత్స్యకారుల శిక్షణ కేంద్రం, వలలు అల్లే షెడ్డు, బోట్ల మరమ్మతు కేంద్రాలు, ఐస్ ప్లాంట్, శీతల గిడ్డంగి తదితర వసతులు కల్పించాలి.. బ్రేక్ వాటర్ వాల్, టెట్రాపాడ్స్, భవన నిర్మాణ పనులు పూర్తికాలేదు. గత ప్రభుత్వం గుత్తేదారు సంస్థకు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణం నెమ్మదించింది. సమస్య ఎక్కడుంది?: చేపల రేవు 58.54 ఎకరాల్లో నిర్మించడానికి సిద్ధమైతే.. 28 ఎకరాలు నిర్మాణ సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. హార్బర్ నిర్మాణంలో భాగంగా సముద్రం లోపలికి రెండు వైపులా రాతి కట్టడాలు నిర్మించడంతో కెరటాల ప్రభావం తగ్గి.. 12 ఎకరాల వరకు భూమి వినియోగంలోకి వచ్చింది. మరో 8 ఎకరాలపై వివాదం నెలకొనడంతో నిర్మాణం ముందుకు కదల్లేదు. మత్స్యకారుల పరిస్థితి ఏమిటి..?: చేపలరేవు అందుబాటులోకి వస్తే 2,500 వరకు పడవలు నిలపవచ్చు. 1.10 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు మత్స్య సంపద సేకరించే వీలుంది. 50 వేల మత్స్యకార కుటుంబాలకు ఉపాధికి ఆస్కారం ఉంటుంది. వలలు అల్లుకోడానికి, చేపలు ఎండబెట్టుకోడానికి, వేటకు వెళ్లి పట్టిన చేపల నిల్వకు వసతులు సమకూరుతాయి. రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు.. 90 శాతం నాబార్డు వాటా రుణం, కేంద్ర ప్రభుత్వ మత్స్యకార మౌలిక వసతుల అభివృద్ధి నిధులు జోడించి చేపల రేవు నిర్మాణం పూర్తిచేయాలి. కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రాజెక్టుల సమీక్షలో అమీనాబాద్ చేపలరేవు చర్చకు వచ్చింది. న్యాయపరమైన చిక్కుల్లో ఉన్న స్థలం జోలికి వెళ్లకుండా అందుబాటులో ఉన్న భూమితో ప్రాజెక్టు పూర్తిచేయాలన్న నిర్ణయానికి వచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీనిని పూర్తిచేస్తానని హామీ ఇవ్వడం..ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించడంతో మత్స్యకారుల్లో ఆశలు నెలకొన్నాయి.

# తెల్లబంగారానికి చీడపీడలు

పులివెందుల:తెల్లబంగారంగా చెప్పుకునే పత్తి పంటను చీడ, పీడలు వెంటాడుతున్నాయి. పత్తి పంటకు తెగులు సోకడం, లద్దెపురుగు విజృంభిస్తుండడంతో రైతులకు శాపంగా మారింది. ప్రతి చేలో ఏదోక రోగం సోకి పంట దెబ్బతింది. ఈ ఏడాది ఎందు తెగులు ఉధృతి ఎక్కువగా ఉంది. అంతేకాక దాదాపు నెల రోజులపాటు వర్షం లేకపోవడంతో ఆకులు ఎండి రాలిపోయాయి. డిసెంబరు వరకు పచ్చగా ఉండాల్సిన పొలాలు నెల ముందుగానే ఆకులు రాలి ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదలు కాసిన కాయలు గింజ కట్టకుండానే పగిలాయి. ముందుగా పగిలిన పత్తి బరువు తూగదని రైతులు అల్లాడిపోతున్నారు. పదిహేను రోజుల కిందట వర్షం ఉంటే పూతంతా కాతగా మారేది. చెట్లు ఎండిపోయాక వర్షం కురిసిందని, ఈ వానతో ప్రయోజనం లేదంటున్నారు. మూడు సార్లు పత్తి ఏరాల్సి ఉండగా, ఒకే దఫాతో పత్తి సేకరణ పూర్తయ్యేలా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది పత్తిలో లద్దె పురుగు ఉధృతి అధికంగా ఉంది. మాయదారి చీడ రైతుల ఆశలను తొలిచేసింది. కాయలు పెరిగే దశలో పురుగు ఎక్కువకావడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. రోజుల వ్యవధిలోనే ఆకు, పూత, పిందె, కాయలను తినేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పురుగు నియంత్రణకు రైతులు పాడరానిపాట్లు పడుతున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టి మందులు స్ప్రే చేస్తున్నారు. గతంలో ఒకేసారి పురుగు మందు స్ప్రే చేస్తే లార్వా నుంచి పురుగుల వరకు నాశనం అయ్యేవి. పురుగులను అదుపు చేసేందుకు ఒక్కో రైతు మూడు సార్లు మందులు పిచికారీ చేశారు. మందు స్ప్రే చేసిన వారం పదిరోజుల్లో చేలల్లో పురుగులు మళ్లీ కనిపిస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. పెరిగిన విస్తీర్ణం.. తగ్గనున్న దిగుబడిఈ సీజన్‌లో జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది 12 వేల ఎకరాల్లో పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ ప్రతికూల పరిస్థితులు, చీడపీడల కారణంగా దిగుబడులు తగ్గనున్నాయి. చెట్టుకు వందకుపైగా కాయలు ఉండాలి కానీ.. 20 నుంచి 25 మాత్రమే ఉన్నాయి. ఉన్న కాయలు కూడా సైజు పెరగడం లేదని అంటున్నారు. సాదారణంగా ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. అలాంటిది 5 నుంచి



6 క్వింటాళ్లు దిగుబడి రావడమే కష్టమని రైతులు అంటున్నారు.సగం చేను ఎండిపోయిందినాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశాను. మొదట మంచి గా ఎదిగింది. పదిహేను రోజుల కిందట తెగులు సోకింది. వారం పది రోజుల్లోనే సగం చేను ఎండిపోయింది. మిగతా చెట్లు కూడా వడలిపోతున్నాయి. ముం దుగా కాసిన కాయలే తప్ప, ఆ తర్వాత వచ్చిన పూత కాత రాలిపోయింది. ఏటా మూడు సార్లు పత్తి ఏరే వాళ్లం.. ఈ సారి ఒక్క సారికే చేను ఖాళీ అయ్యేలా ఉంది.– గంగమ్మ, పత్తి రైతు, పెర్నపాడు, వేముల మండలం లద్దె పురుగు లొంగడం లేదుపొగాకు లద్దెపురుగు పత్తికి తీవ్రంగా నష్టం చేస్తోంది. ఈ ఏడు వర్షాలు లేక చేలు సరిగ్గా ఎదగనే లేదు. పూత, కాతను దక్కించుకుందామంటే లద్దె పురుగు దాపురించింది. పురుగులు ఆకులను మేసి జల్లెడలా మారుస్తున్నాయి. రెండుమూడు రోజుల వ్యవధిలోనే చేనంత మేసేస్తున్నాయి. పూత, గూడ, కాయలను తినేస్తున్నాయి. ఇప్పటికి మూడు సార్లు పురుగు మందు పిచికారీ చేశాను. మందుకు పురుగులు లొంగడం లేదు. పురుగు మందులకు వేలకు వేలాది రూపాయలు ఖర్చవుతోంది.– నాగేశ్వర్‌రెడ్డి, రైతు, లింగాలవర్షాభావంతో తగ్గిన దిగుబడినాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా.. వర్షాలు మొదట్లో మంచిగా కురిశాయి. దీంతో చెట్లు ఏపుగా పెరిగినా కాయలు లేవు. కొంత పూత దశలో ఎండ వేడికి రాలిపోగా.. మరికొన్ని కాయలు వచ్చిన తర్వాత రాలిపోయాయి. చెట్టుకు 20 కాయలకు మించి లేవు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు

# ప్రైవేటు పాఠశాల కోసం పార్కు అభివృద్ధా...?

పీఎం పాలెం,:ఇళ్ల ముందు పార్కులు అభివృద్ధి చేయాలని ప్రజలు ఎన్నిమార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు.... ఓ ప్రైవేటు పాఠశాల విన్నపంతో పార్కు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. పీఎం పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కన జీవీఎంసీ పార్కు స్థలం ఉంది. దీనికి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు క్రీడా మైదానం లేదు. పలువురు తమ పిల్లలు శారీరక క్రీడలకు దూరమవుతున్నారని సంబంధిత పాఠశాలలో చేర్పించేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో పాఠశాల యాజమాన్యం జీవీఎంసీ అధికారులతో అంతర్గత చర్చలు జరపడంతో వారు సైతం పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. వెంటనే దీని అభివృద్ధికి సుమారు రూ.20 లక్షలు మంజూరు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారని సమాచారం. త్వరలోనే పలు క్రీడా పరికరాలతో పార్కును సిద్ధం చేస్తారనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ రెండు రోజుల క్రితం పార్కు ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రత చర్యలు పూర్తి చేసింది. పాఠశాల యాజమాన్యం లోతట్టుగా ఉన్న పార్కులో



మట్టిని వేసి చదును పనులు చేసింది. ఇదే ప్రాంతంలో జనావాసాల మధ్య విశాలమైన రెండు పార్కులను అభివృద్ధి చేయాలంటూ స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. ఈ పార్కు విషయంలో జీవీఎంసీ అధికారులు అత్యుత్సాహం చూపడంపై విమర్శలు వస్తున్నాయి.

# నిర్వాసితుల భూములను కాపాడాలి



ముద్దనూరు: అన్యాక్రాంతమైన గండికోట నిర్వాసితుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, నిర్వాసితులకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, డివైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వాసితులతో కలిసివారు తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ గండికోట నిర్వాసిత ప్రజలకు ప్రభుత్వం ముద్దనూరులోని చౌటిపల్లె గ్రామంలో కేటాయించిన భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. నిర్వాసితులకు ముద్దనూరులోని మంగపట్నం రెవెన్యూ పొలంలో కేటాయించిన భూములకు జిల్లా అధికారులు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. దీంతో ఆ భూములు స్థానికులు, కొందరు అక్రమార్కులు, రాజకీయ నాయకులు వందలు ఎకరాలు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. చౌటిపల్లి గ్రామం నిర్వాసితులకు కోసం అప్పటి ప్రభుత్వం 2010లో 869 ఎకరాల భూమి కేటాయించి, కంప చెట్లు, పొదలు తొలగించేందుకు రూ. 31,29,696 ఖర్చు చేసిందన్నారు. ఇప్పటికే అసైన్ మెంట్ ఆమోదం పొందిన భూములకు పట్టాలు మంజూరు చేయాల్సింది ఉందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు,ప్రజా ప్రతినిధులు నిర్వాసితుల భూములకు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. అన్యక్రాంతమైన భూములను కూటమి ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని నిర్వాసితులందరికీ, ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున భూ పంపిణీ చేసి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ. 3.5 లక్షలు ఇవ్వలేదన్నారు. నిర్వాసితులు అధికారులను అడిగితే బడ్జెట్ లేదని దాటేస్తున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 12 లక్షల అమలు చేస్తామని వాగ్దానం చేశారన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల నిర్వాసితులను కలుపుకుని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చౌటపల్లి నిర్వాసితులు రామలింగారెడ్డి యోహాన్, మాజీ ఎంపిటిసి సభ్యులు గురునాథ పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాల నిర్మాణంపై నీలినీడలు

మార్కాపురం: మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. గత మూడు నెలలుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ పనులను దక్కించుకున్న మెగా కంపెనీ కూడా యంత్ర సామగ్రిని తరలించే పనిలో ఉంది. మెడికల్ కళాశాల నిర్మాణం నిలిచిపోతుందేమోనని పశ్చిమ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మార్కాపురం ప్రాంతం వైద్య రంగంలో పూర్తిగా వెనుకబాటులో ఉంది. మెరుగైన వైద్యం కోసం వందల కిలో మీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఆపద సమయాల్లో అత్యవసర సేవలు అందుబాటులో లేక దూర ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఒంగోలు, గుంటూరు, విజయవాడ, కర్నూలు నగరాలకు చేరేందుకు గంటల పాటు సమయం పట్టేది. ఈ లోగా ఎందరో రోగులు మార్గమధ్యంలో మరణించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వం మార్కాపురం ప్రాంతంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల అవసర మని గుర్తించింది. అందుకోసం మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద 53 ఎకరాల స్థలాన్ని సేకరించింది. ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం కోసం రూ.473 కోట్లు కేటాయిం చింది. ఈ పనులను మెగా ఇంజనీరింగ్ కంపెనీ దక్కిం చుకుంది. నిర్మాణ పనుల ను అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కరోనా సమయంలో పర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. మార్కాపురం ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అత్యవసరమని తలచిన ప్రభుత్వం 2024 సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలని నిర్ణయించింది. మెగా కంపెనీ కూడా నిర్మాణ పనులను వేగవంతం చేసింది. 30 శాతానికి పైగా పనులు పూర్తి చేసింది. పూర్తి స్థాయిలో పనులు పూర్తవ్వాలంటే మరో రెండేళ్ల పాటు సమయం పట్టనుంది. ముందుగా నిర్ణయించిన 2024 సెప్టెంబరులో మెడికల్ కళాశాలను నిర్వహణలోకి తీసుకురావాలనే సంకల్పంతో మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలను సర్వజన వైద్యశాలగా మార్పు చేశారు. ఆ వైద్యశాలలో కొన్ని భవనాలు నిర్మించారు. మెడికల్ కళాశాలకు



సంబంధించిన వసతు లన్నీ కల్పించారు. కొంద రు వైద్యులను, వైద్య సిబ్బందిని నియమిం చారు. ఇక్కడ పరిస్థితు ల దృష్ట్యా మెడికల్ కళాశాలను నిర్వహించా లని కోరు తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరిన సంగతి తెలిసిందే. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రానే వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి ఓటమిపాలైంది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వ కాలంలో ప్రారంభించిన మెడికల్ కళాశాలల నిర్మాణం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. అందులో మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల కూడా ఉంది. మొత్తానికి మూడు నెలలుగా నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఈ పాటికే మెడికల్ కళాశాలకు సంబంధించిన అనేక భవనాలు పూర్తి చేసుకున్నాయి. చుట్టూ ప్రహరీ గోడ కూడా నిర్మించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత మెడికల్ కళాశాల నిర్మాణం నిలిచిపోయిందనే ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికార పార్టీ నేతలు ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో ప్రజల్లో అపనమ్మకం ఏర్పడింది. ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు దక్కించుకున్న మెగా ఇంజనీరింగ్ కంపెనీ నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు తెలిసింది. బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం.

# 'టిడ్కో' లబ్ధిదారుల ఆశలన్నీ కూటమిపైనే..?

చిత్తూరు: టీడీపీ 2014-19 మధ్యలో అధికారంలో ఉన్నప్పుడు పట్టణ మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ (టిడ్కో) ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాలను చేపట్టింది. 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు రకాల గృహ నిర్మాణాలను ప్రారంభించారు. 300 చదరపు అడుగుల గృహానికి లబ్ధిదారుడి వాటా రూ.500 కాగా, 365 చ.అడుగులకు రూ.50 వేలు, అలాగే 430 చ.అడుగులకు రూ.లక్ష డిపాజిట్ చేయాలి. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల నుంచి అధికారులు నిర్మాణానికి ముందే వసూలు చేశారు. ప్రతి యూనిట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ రూ.1.50 లక్షల చొప్పున, మొత్తం రూ.3 లక్షలు ఉంటుంది. యూనిట్‌ను బట్టి బ్యాంకు రుణాలూ ఉంటాయి. టీడీపీ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని నగర, పురపాలక సంఘాల్లో 17,395 టిడ్కో గృహాలను మంజూరు చేసింది. అప్పట్లోనే లబ్ధిదారుల నుంచి డబ్బులు కూడా వసూలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పునాది దశలో ఉన్న గృహాలను 2020 జూన్‌లోనే రద్దు చేసేసింది. ఇలా ఉమ్మడి జిల్లాలో 6288 గృహాలు రద్దయ్యాయి. తిరుపతిలో 1200, చిత్తూరులో 672, మదనపల్లెలో 1056, శ్రీకాళహస్తిలో 1632, పుంగనూరులో 624, పుత్తూరులో 576, నగరిలో 528 గృహాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వైసీపీ ప్రభుత్వం 6,288 మంది గృహాలను రద్దు చేసినా, వారు చెల్లించిన డిపాజిట్లను మాత్రం వెనక్కి ఇవ్వలేదు. రద్దయిన గృహాల్లో 1360 మంది రూ.500 వంతున చెల్లించిన రూ.6.80 లక్షలు, 2784 మంది రూ.50 వేల చొప్పున చెల్లించిన రూ.13.92 కోట్లు, 2384 మంది రూ.లక్ష చొప్పున చెల్లించిన రూ.23.84 కోట్ల డిపాజిట్లను వెనక్కి ఇవ్వలేదు. మొత్తంగా రూ.37.82 కోట్లు వెనక్కి ఇవ్వాల్సి ఉంది. మాకు ఇళ్లు దక్కలేదు.. డిపాజిట్లూ వెనక్కి



ఇవ్వలేదంటూ లబ్ధిదారులు నాలుగేళ్లుగా ఆవేదన చెందుతున్నారు. చిత్తూరు నగరంలోని పూణేపల్లె వద్ద టిడ్కో గృహ సముదాయాల్ని నిర్మించారు. టీడీపీ ప్రభుత్వంలో 70 శాతం పనులు పూర్తయ్యాయి. పునాది దశలో ఉన్న 672 గృహాలను ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలిన 2832 గృహాల నిర్మాణానికి రూ.140 కోట్లను ఖర్చు చేశారు. గృహ సముదాయంలో రోడ్లు, కాలువలు వంటి మౌలిక వసతులూ కల్పించారు. 2020 మంది లబ్ధిదారులకు
మంజూరు పత్రాలను అందించారు. అయినా ఇక్కడ లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయలేదు. నెల రోజుల్లో టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలంటూ ఇటీవల జరిగిన చిత్తూరు నగరపాలక సంస్థ సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. రద్దయిన ఇళ్ల లబ్ధిదారులకూ ప్రజాప్రతినిధులు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని గూడూరుపల్లె వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను గతేడాది అక్టోబరులో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు.

# క్రీడారంగం పురోగమించేనా?

తిరుపతి : జిల్లా కేంద్రమైన తిరుపతిలో దాదాపు 20 ఎకరాల్లో శ్రీనివాస క్రీడా సముదాయం ఉంది. ఇందులో కార్యాలయం, ఇండోర్ స్టేడియం (షటిల్‌బ్యాడ్మింటన్, జిమ్, యోగా, బాక్సింగ్ క్రీడలకు అనుకూలంగా ఉంది). వెలుపల ఫ్లడ్‌లైట్లతో కూడిన రెండు టెన్నిస కోర్టులు, స్కేటింగ్ రింగ్, స్విమ్మింగ్ పూల్, క్రికెట్‌నెట్ ప్రాక్టీసు స్థలాలున్నాయి. తాత్కాలిక వసతుల మినహా శాశ్వత, అధునాతన సదుపాయాలు లేవు. అలాగే శ్రీకాళహస్తి, సత్యవేడులలో అరకొర ఏర్పాట్లతో క్రీడా ప్రాంగణాలు మాత్రమే ఉన్నాయి. హాకీ, ఫుట్‌బాల్, రెజ్లింగ్, వాలీబాల్, జూడో, స్విమ్మింగ్, స్కేటింగ్‌లకు మాత్రమే కోచ్‌లున్నారు. షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, జిమ్నాస్టిక్, ఖోఖో, అథ్లెటిక్, క్రికెట్ అంశాలకు శిక్షకులు కరువయ్యారు. దీంతోపాటుగా గ్రౌండ్స్‌మెన్స్, ఆఫీసు అటెండర్లు, స్విమ్మింగ్‌పూల్ లైఫ్‌గార్డ్స్, స్వీపర్లు, వాచ్‌మెన్ లేకుండా క్రీడాప్రాంగణాలు కొనసాగుతుండడం గమనార్హం. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రగిరిలో రూ.2.1కోట్లతో ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం ఏర్పాటైంది. అయితే ప్రభుత్వం మారగానే అర్ధంతరంగా పనులు ఆగిపోయాయి. ఇప్పటికీ మొండిగోడలతో దర్శనమిస్తోంది. ప్రాంగణం కూడా నిరుపయోగంగా ఉంటోంది. 2022లో తమిళనాడు తరహా జిల్లావ్యాప్తంగా అకాడమీలు, క్రీడా వసతి గృహాల ఏర్పాటు అన్నది ప్రతిపాదనలకే పరిమితమైంది. రూ.52లక్షలతో శ్రీనివాస క్రీడా సముదాయంలో వాణిజ్యసముదాయం నిర్మాణానికి అనుమతులు వచ్చినా నిధులు విడుదల కాలేదు. ఔట్‌డోర్ మైదానాల ఏర్పాటుకు చేసిన ప్రతిపాదన కూడా మరుగున పడిపోయింది. దీంతో డిస్ట్రిక్ట్ అథారిటీ కోచ్‌లు బయట పాఠశాలలు, కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. పే అండ్ ప్లే విధానంతో వసూలైన నగదు కూడా నేరుగా శాప్‌కు చేరడంతో జిల్లా క్రీడాభివృద్ధి కుంటుపడింది. మూడేళ్ల క్రితం అప్పటి పాలకులు స్వార్థంతో ప్రవేశపెట్టిన ఈ విధానం నిష్ప్రయోజనంగానే మిగిలిపోయింది. జిల్లా నుంచి ఏడాదికి దాదాపు రూ.50లక్షల వరకు శాప్‌ఖాతాలో జమ అవుతున్నా.. అక్కడినుంచి వచ్చే నిధులు మాత్రం రూ.18లక్షలే. దీనివల్లే క్రీడారంగం అభివృద్ధి చెందలేకపోతోందని



పలువురి క్రీడాభిమానుల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయం. జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో పనిచేస్తున్న కోచ్‌లకు నాలుగు నెలలుగా జీతాలు రాలేదు.
దాంతో వారి కుటుంబ పోషణ భారంగా మారిపోయింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా స్కీమ్ ద్వారా ఒకరు, శాప్ కోచ్‌లుగా ముగ్గురు (క్రికెట్, టెన్నిస్, హాకీ), ఔట్ సోర్సింగ్‌లో (జూడో, ఫుట్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, హాకీ), పే అండ్ ప్లేలో (వాలీబాల్, స్కేటింగ్, రెజ్లింగ్)మొత్తం డజను మంది కోచ్‌లు శిక్షణ అందిస్తున్నారు. కాగాఖేలో ఇండియా స్కీమ్, శాప్,పే అండ్ ప్లే కోచ్‌లకు మాత్రం నెల నెలా జీతాలు సక్రమంగా అందుతున్నాయి. ఔట్‌సోర్సింగ్ కోచ్‌లకు (ఒక్కొ క్కరికి రూ.19,500 చొప్పున) మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన జీతాలు చెల్లించలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆప్కాస్ పరిధిలో ఉండడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని తెలుస్తోంది. ఆప్కాసకు మార్చికే కాలపరిమితి ముగిసిం ది. కొనసాగింపునకు సిఫార్సు చేసినా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సాధ్యపడలేదు. నూతన ప్రభుత్వం ఏర్పడి గత నెల చివర్లో ఆప్కాస్ సంస్థకు మరో ఏడాది కాలపరిమితి పొడిగింపు లభించింది. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ఇకనైనా తమకు జీతాలు చెల్లించాలని ఆయా కోచ్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇప్పటికైనా మార్పు వచ్చేనా!

గోదావరిఖని:విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంతో నగరపాలిక నిర్వహణ మెరుగు పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేస్తానని, నిర్వహణ తీరు మెరుగు పరచుకోకుంటే చర్యలు తప్పవని శనివారం నిర్వహించిన నగరపాలిక సమీక్షలో కలెక్టర్ పేర్కొన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడంటూ పారిశుద్ధ్య తనిఖీ అధికారిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. సుదీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేశారు. నగరపాలక ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించేందుకు ముగ్గురు అధికారులతో పాటు వారికి సహాయకులుగా 12 మంది పారిశుద్ధ్య పర్యవేక్షకులున్నారు. క్షేత్రస్థాయిలో సహాయ పర్యవేక్షకులు మాత్రమే పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపడుతుండగా పర్యవేక్షకులు మాత్రం అప్పుడప్పుడు క్షేత్రస్థాయి పర్యవేక్షణకు వెళుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకోవడం మినహా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ మొదలుకొని సేంద్రియ ఎరువు తయారీలో ఒకప్పుడు రామగుండం నగరపాలిక ముందంజలో ఉండగా ఇప్పుడు పూర్తిగా గాడి తప్పింది. రహదారుల వెంట చెత్తకుప్పలు దర్శనమిస్తూనే ఉన్నాయి. నగరపాలక కార్యాలయంలో తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని జిల్లా పాలనాధికారి ఆదేశించడంతో సమయపాలన కొంత మెరుగు పడే అవకాశమున్నట్లు పలువురు భావిస్తున్నారు. పారిశుద్ధ్య విభాగంలోని కొందరు కార్మికులు ఒకరికి బదులుగా ఒకరు విధులకు వస్తుండగా కొందరు విధులకు రాకుండానే వేతనాలు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు తాజా, మాజీ ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో పనిచేస్తున్నట్లు సమాచారం.



నగరపాలక కమిషనర్‌గా శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టిన వెంటనే వీటిపై దృష్టి సారించి ఇళ్లల్లో పనిచేసేవారిని వెనక్కి పిలిపించడంతో పాటు హాజరులో అక్రమాలను అరికట్టేలా నిరంతరంగా క్షేత్రస్థాయి పర్యటన చేపట్టడంతో కొంత మేరకు ప్రయోజనం చేకూరుతోంది. తమకు బిల్లుల చెల్లింపుల్లో సంబంధిత విభాగానికి చెందిన ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ గుత్తేదారులు స్వయంగా జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేయడం గమనార్హం. కార్పొరేషన్‌లో డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉంది. నగరంలో సేకరించిన చెత్తను ఎక్కడ పడేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో గోదావరి ఒడ్డున వ్యర్థాలను పడేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా నిర్వహణను మెరుగు పరుస్తాం. నగరంలోని పారిశుద్ధ్య కార్మికులంతా పనులు నిర్వహించాల్సి ఉంది. బయోమెట్రిక్ యంత్రాలను తెప్పించేందుకు టెండరు పిలిచాం. త్వరలోనే పూర్తిస్థాయిలో బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తాం.


# రూ.32 లక్షలకుపైగా ఎరువులు, విత్తనాలు సీజ్



గుంటూరు : వ్యవసాయ శాఖ ప్రత్యేక తనిఖీ బృందాలు విజిలెన్స్ అధికారులతో కలిసి గుంటూరు, పల్నాడు జిల్లాల్లో విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల ఉత్పత్తిదారులు, అమ్మకందారుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. గుంటూరు జిల్లాలో 6 విత్తన ఉత్పత్తి, అమ్మకందారుల దుకాణాలు తనిఖీ చేసి, నిబంధనలు పాటించని వారి విక్రయ కేంద్రాల్లో రూ.23.31 లక్షల విలువైన 10.33 క్వింటాళ్ల మిర్చి, పత్తి విత్తనాల విక్రయాలు నిలిపేశారు. నాణ్యతా ప్రమాణాల కోసం 8 మిర్చి విత్తన శాంపిళ్లను సేకరించి, పరీక్షల నిమిత్తం లేబోరేటరీకి పంపించా రు.విత్తన, ఉత్పత్తిదారుల, అమ్మకందారులు మిర్చి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, విత్తనాల నిల్వలను స్టాక్ బోర్డులో ప్రకటించాలని, రైతులకు బిల్లులివ్వాలని అధికారులు స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎడిఎ ఓఎస్ఎస్ సునీల్‌కుమార్, కోనసీమ ఎడిఎ కె.నాగేశ్వరరావు, ఎడిఎ బాలాజీనాయక్, సిఐ విజిలెన్స్ ఎం.మాణిక్యరావు, జెడిఎ ఆఫీసు నుండి ఎఒ టెక్నికల్ గౌతమ్, ప్రసన్న పాల్గొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పలు విత్తన దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి చేపట్టిన తనిఖీల్లో మొదటి బృందం సరైన పత్రాలు లేని రూ.4.77 లక్షల విలువైన విత్తన విక్రయాలను నిలిపేశారు. రెండో బృందం ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలు, డీలర్ షాపులను తనిఖీ చేసి ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలో సరైన పత్రాలు లేని రూ.1.27 లక్షల బయో ఉత్పత్తులు, పురుగు మందులను సీజ్ చేశారు. విత్తన డీలర్ల దగ్గర సరైన ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని రూ.4.08 లక్షల మొక్కజొన్న విత్తనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీమ్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్, విజిలెన్స్ ఎస్ఐ రామచంద్రయ్య, నరసరావుపేట ఎడిఎ మస్తానమ్మ, నరసరావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి నరేంద్ర బాబు, లైజనింగ్ ఆఫీసర్స్ ఏవో ప్రవీణ్, వరలక్ష్మి, ఏఈఓ బ్రహ్మయ్య, రామిరెడ్డి, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

# టన్నుల కొద్దీ తీసేస్తున్నా కొలిక్కిరాని పూడికతీత

తెనాలి: పట్టణంలోని మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి. దీర్ఘకాలికంగా పూడికతీతకు నోచని కాల్వల్లో వ్యర్థాల తొలగింపు అధికారులకు సవాలుగానే మారింది. రోజులకు రోజులు కష్టపడుతున్నా కొలిక్కి రావడం లేదు. ప్రధానంగా ముగురు కాల్వల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తుండాలి. దానికోసం ప్రత్యేకంగా 40 మంది కార్మికులను పురపాలక సంఘం అదనంగా ఉపయోగిస్తున్నా పూర్తిస్థాయిలో పనులు చేయకపోవటంతోనే ఇప్పుడు సమస్య జఠిలమైందని స్థానికులు అంటున్నారు. పైగా ఎక్కడికక్కడ కాల్వలపై శ్లాబ్ తరహాలో బల్లలు, బండలు వేసి సిమెంట్ చేసేశారు. దీంతో వ్యర్థాలు తొలగించేందుకు వీల్లేకుండా పోయింది.
ఫలితంగా వర్షం పడితే వీధులన్నీ జలమయం కావటం, వర్షపునీటికి మురుగునీరు తోడై ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రంగా స్పందించారు. కమిషనర్‌తో పాటు అధికారులతో సమీక్షించి మురుగు కాల్వల



ప్రక్షాళనకు ఆదేశించారు. దీనిపై దాదాపు 15 రోజులుగా టౌన్‌ప్లానింగ్ విభాగం కసరత్తు చేస్తోంది. ఎక్కడి కక్కడ సైడు కాల్వలపై శ్లాబుల తరహాలో ఏర్పాటు చేసుకున్న బండలను జెసిబితో తొలగించి టన్నుల కొద్ది వ్యర్థాలను కాల్వల నుంచి వెలికి తీస్తున్నారు. బుర్రిపాలెం రోడ్డులో చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.

# బయోగ్యాస్.. నిర్వహణ తుస్!




వేములవాడ: వేములవాడలోని రాజన్న గోశాలలో కోడెల, ఆవుల పేడ వృథా పోకుండా విద్యుత్తు తయారు చేసి గోశాలతోపాటు పక్కనే ఉన్న ఏరియా ఆసుపత్రి అవసరాలకు అందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. కోడెలు, ఆవులు వందల సంఖ్యలో ఉండటంతో ప్రతి రోజు 25 టన్నుల పేడ సమకూరుతుంది. దీంతో దాదాపు 24 కిలోవాట్లకు పైగా విద్యుత్తు ఉత్పత్తిఅయ్యే అవకాశం ఉండడంతో బయోగ్యాస్ విద్యుత్తు ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఏడాది క్రితమే ప్లాంట్‌ను ప్రారంభించారు కానీ..ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. బయోగ్యాస్ విద్యుత్తు ప్లాంట్‌లో పేడను మిక్సింగ్ చేసే పరికరం అతి ముఖ్యమైనది. ఇది మరమ్మతుకు గురైనా తగిన మరమ్మతు నిర్వహించకుండా వదిలేశారు. ఫలితంగా రోజుల తరబడి ప్లాంట్ పనిచేయకుండానే ఉంటోంది.దీని మరమ్మతును తమిళనాడులో చేయించాల్సి ఉండగా.. అధికారులు వేగంగా ఆ దిశగా తగిన చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించిన యంత్రంలో సాంకేతికలోపం తలెత్తితే సరిచేయకుండా వదిలేయడం సరికాదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి పకడ్బందీ నిర్వహణ చేపట్టాలని కోరుతున్నారు. వేములవాడ మున్సిపల్ అధికారులు రూ.31.60 లక్షలతో తిప్పాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం గోశాలలో బయోగ్యాస్ విద్యుత్తు ప్లాంట్‌ను ఏర్పాటు చేసి నిర్వహణను దేవస్థానానికి అప్పగించారు. ఈ ప్లాంట్‌కు రోజూ దాదాపు 24 కిలోవాట్లకు పైగా విద్యుత్తును ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ప్లాంట్ ఆ తరువాత ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తి పెరిగింది. దీంతో సమీపంలోని ప్రాంతీయ ఆసుపత్రికి సైతం వినియోగించేందుకు నిర్ణయించారు.

# నేలకు దిగనున్న ఇసుక ధరలు!

తిరుపతి:గత ఐదేళ్ళుగా నింగికెక్కిన ఇసుక ధరలు రేపటి నుంచీ నేలకు దిగనున్నాయి. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఇసుకను ఉచితంగా అందజేస్తామన్న హామీకి అనుగుణంగా కొత్త ప్రభుత్వం ఇసుకపై నూతన విధానాన్ని రూపొందించింది. ప్రాథమికంగా స్టాక్ పాయింట్ల నుంచీ ఇసుకను వినియోగదారులకు అందించేందుకు విధి విధానాలను ప్రకటించింది.స్టాక్ పాయింట్ నిర్వహణకు, లోడిం గ్‌కు అయ్యే ఖర్చు వంటి వాటికి మాత్రమే వినియోగదారులు ప్రభుత్వానికి డబ్బు చెల్లించాలని స్పష్టం చేసింది. ఇది నామమాత్రపు ధరేనని,రవాణా ఖర్చు మాత్రం వినియోగ దారులు భరించాల్సి వుంటుందని ప్రకటించింది. మొత్తం మీద గత ఐదేళ్ళుగా రూ. 5 వేల నుంచీ రూ. 6 వేల వరకూ పలికిన ఇసుక లోడు ధర ఇపుడు ప్రజలకు అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లాకు సంబంధించిన ఇసుక లభ్యత, స్టాక్ పాయింట్ల వివరాలు, నిర్ణయించిన ధరల వివరాలను కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎస్‌కు వివరించారు. జిల్లాలో సోమవారం నుంచీ ఐదు స్టాక్ పాయింట్లు జనానికి అందుబాటులోకి రానున్నాయి. శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని సుబ్బానాయుడు కండ్రిగ వద్ద రెండు , పిచ్చాటూరు మండలం ఏకే బీడు వద్ద ఒకటి, దొరవారిసత్రం మండలం మామిళ్ళ పాడులో ఒకటి, వెంకటగిరి మండలం మొదులుగుంటలో ఒకటి చొప్పున ఐదు స్టాక్ పాయింట్లను జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీటిని సోమవారం నుంచీ తెరవనున్నారు. ఉదయం 6 నుంచీ సాయంత్రం 6 దాకా స్టాక్ పాయింట్లలో ఇసుక బట్వాడా జరుగుతుంది.సుబ్బానాయుడు కండ్రిగ, ఏకే బీడుల్లోని మూడు స్టాక్‌పాయింట్లలో టన్ను ఇసుకకు రూ. 200 చొప్పున ప్రభుత్వానికి చెల్లించాలి. మామిళ్ళపాడు వద్ద రూ. 465 చొప్పున, మొదులుగుంట స్టాక్ పాయింట్‌లో టన్నుకు రూ. 590 వంతున చెల్లించాలి.ఆధార్ కార్డు ప్రాతిపదికగా రోజుకు ఒక వ్యక్తికి గరిష్టంగా 20 టన్నుల ఇసుక మాత్రమే స్టాక్ పాయింట్‌లో కేటాయించనున్నారు. అంటే ట్రాక్టర్ లోడ్ ప్రాతిపదిక తీసుకుంటే రోజుకు ఐదు లోడ్‌ల ఇసుక మాత్రమే ఒకరు పొందడానికి వీలవుతుంది.ఇసుక ధరల చెల్లింపునకు ప్రభుత్వం డీఎంజీ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వెబ్‌సైట్‌లోని క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి డిజిటల్ పేమెంట్(ఫోన్‌పే, పేటీఎం, గూగూల్‌పే) ద్వారా చెల్లించి స్టాక్ పాయింట్ వద్ద రశీదు చూపిస్తే ముందు వచ్చిన వారికి ముందుగా అన్న ప్రాతిపదికన ఇసుక కేటాయింపులు జరుగుతాయి.ఇసుక ద్వారా వచ్చిన ఆదాయం కూడా స్థానిక సంస్థలకే జమ కానుంది. జిల్లాలో సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. నాయుడుపేట పరిధిలోని కూచివాడలో సుమారు 5లక్షల క్యూబిక్ మీటర్ల టన్నుల ఇసుక తవ్వకాలకు మైనింగ్ అధికారులు రీచ్‌లను గుర్తించారు.



పర్యావరణ అనుమతులు రాగానే ప్రజావసరాలకు కావాల్సిన ఇసుక అందుబాటులోకి రానుంది. గ్రామ పంచాయతీల పరిధిలోని వాగులు వంకల్లో ఇసుక తీత, లోడింగ్ వంటి వాటికి యంత్రాలు వాడకూడదని ప్రభుత్వం సూచించింది. గ్రామప్రజల అవసరాల నిమిత్తం ఇసుకను ఉచితంగా వినియోగించుకోవచ్చు. అయితే ఇసుక వ్యాపారులు ఎవరైనాసరే అక్రమంగా ఇసుక తరలించినా డంపింగ్ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని అధికారులు హెచ్చరించారు. దీనిపై పోలీసులు,సెబ్, రెవెన్యూ శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టనున్నాయి.

# ప్రభుత్వ ఫైళ్ల దహనం..!

పుంగనూరు : చిత్తూరు జిల్లా పుంగనూరు ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా శ్మశానం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ప్రభుత్వ రికార్డులు దహనమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ కార్యాలయానికి చెందిన రికార్డులను సంచిలో వేసుకొని రహస్యంగా కాల్చి బూడి దచేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీడీవో కార్యాలయంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన రికార్డులు చేరిపేయాలనే ఈచర్యకు పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ పాలనలో ఏదైనా అవినీతి, అక్రమాలు జరిగిఉంటే టీడీపీ ప్రభుత్వంలో వెలికి తీస్తారనే భయంతో ఉపాధిహామీ ఇతరశాఖల రికార్డులు కాల్చివేశారా అనే ప్రచారమూ జరుగుతోంది.



# నీటిపారుదలపై శీతకన్ను

భీమవరం : నీటిపారుదల శాఖపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. పశ్చిమ డెల్టా రైతులకు సాగులో కన్నీరు పెట్టిస్తోంది. కనీసం తూడు, గుర్రపు డెక్క తొలగించడానికి ఆపసోపాలు పడుతున్నారు. కాంట్రాక్టర్ల కాళ్లు వేళ్లు పట్టుకుని పనులు చేయిస్తున్నారు. తీరా పనులు పూర్తయ్యాక ప్రభుత్వం నిధులు మంజూరు చెయ్యకుండా మొండిచేయి చూపుతోంది. గడిచిన వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో తూర్పు, పశ్చిమ డెల్టాకు కేవలం రూ.12 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఈ లెక్క ప్రకారం పశ్చిమ డెల్టాకు ఏటా రూ.20 కోట్ల వరకు నిధులు అవసరం. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏటా రూ.20 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు పనులు చేసిన దాఖలాలు ఉన్నాయి. కాలువలు, డ్రెయిన్‌లలోని పూడికతీత, గుర్రపు డెక్క, లాకులు స్లూయిస్ మరమ్మతులు వంటి పనులు చేపట్టాల్సి వస్తోంది. ప్రభుత్వం వీటిపై ఎప్పుడు కనీసం దృష్టి పెట్టలేదు. వేసవిలో కాలువలు, డ్రెయిన్ పనుల కోసం ఎన్నికల కోడ్ ముందుగానే జనవరిలో ప్రతిపాదనలు పంపారు. తూర్పు, పశ్చిమ డెల్టాకు దాదాపు రూ.40 కోట్లు పనులకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐదు నెలలు గడిచిపోయాయి ఇప్పటికి ప్రభుత్వం నుంచి నిధులపై చలనం లేదు. ఒక్క పైసా మంజూరు చేయలేదు. అధికారులు ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల తర్వాతైనా నిధులు కేటాయిస్తుందని జిల్లా అధికారులు భావించారు. కాని, ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకు లేదు. ఒక పశ్చిమ డెల్టాలోనే మురుగు డ్రెయిన్‌ల ప్రక్షాలన చేయాలంటూ గుర్రపుడెక్క, చెత్త పనులకు 66 పనులు నిమిత్తం రూ.12 కోట్లు, 66 పూడికతీత పనులకు రూ.8 కోట్లు మొత్తం 20 కోట్లు వెచ్చించి ఈ వేసవిలో పనులు చేపట్టాలి. అవి ప్రతిపాదనలతోనే సరిపెట్టు కున్నాయి. జిల్లాలో వర్షాలు



పడితే పంట పొలాలు మునక తప్పదు. కాలువలు మట్టితో, గుర్రపు డెక్కలతో డ్రెయిన్‌లు పూడికపోవడం వలన నీటి ప్రవాహం జరగక వర్షపు నీటితో పంట పొలాలు మునిగిపోతున్నాయి. గత ఏడాది సార్వాలో తుఫాన్ దెబ్బకు ఏకంగా సగం సాగు 50 వేల హెక్టార్‌కు పైగా నీటి ముంపునకు గురై పెట్టుబడిలోనే భారీ నష్టాలు రైతులు చవిచూశారు. గడిచిన ఐదేళ్ళలో సార్వా సాగులో రైతులు ఇదే పరిస్థితులను ఎదుర్కొంటు వచ్చింది. లోతట్టు ప్రాంతాలలోని పంట పొలాలు అయితే ఎక్కువ ముంపునకు గురవ్వడం వలన సాగు చేయడం మానివేశారు. గడిచిన సార్వా పంటలో 50 వేల ఎకరాలు సాగు జరగలేదు. ఈ దాళ్వాలో మండలానికి వందల ఎకరాలు సాగు లేక బీడు చేలుగా కనిపించింది. దీంతో రైతులు పంట భూమి వున్నా సాగు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. ఆదాయాన్ని కోల్పోయారు. ఇదంతా కాలువలు ఆధునికీకరణ లేకేనని రైతులు చెబుతున్నారు.

# ఎరువుల నిల్వలపై నిఘా



నల్గొండ:జిల్లాలో మరికొద్ది రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే అవకాశముంది. ఎరువుల కొరత ఏర్పడుతుందేమోనని ఎక్కువ మొత్తంలో సాగు చేసే రైతులు పంటలకు కావాల్సిన ఎరువులను ముందస్తుగా కొనుగోలు చేసి నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఎరువుల నిల్వలు తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ చేపట్టింది. ఇందుకు ప్రత్యేకంగా ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం (ఎఫ్ఐవీఈఎస్) యాప్‌ను అందుబాటులోని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని అన్నీ దుకాణాల్లో తరచూ తనిఖీలు చేస్తూ యాప్‌లో సంబంధిత వివ రాలు నమోదు చేస్తున్నారు. సీజన్‌లో యూరియా, తదితర రసాయన ఎరువుల కొరత ఏర్పడి రైతులు నానా అవస్థలు పడుతుంటారు. రైతులకు ఇబ్బందులు తొలగించేందుకు రైతుల డిమాండ్ అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పంపిణీ పక్కాగా ఉండేందుకు ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం (ఎఫ్ఐవీఈఎస్) యాప్‌ను వినియోగిస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించకుండా పారదర్శకంగా రైతులకు ఎరువులు అందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాల ద్వారా విక్రయించాలని నిబంధనలు ఉన్నా, కొందరు డీలర్లు విస్మరిస్తున్నారు. దీన్ని నిరోధించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, సహాయ సంచాలకులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిల్వలను యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. దీంతోపాటు జియోట్యాగింగ్ అనుసంధానం చేశారు. ప్రతి వారంలో మండల వ్యవసాయ అధికారులు, సహాయ సంచాలకులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేయాలి. దుకాణాల్లో ఎరువుల వివరాలు పరిశీలించాలి. నిల్వ వివరాలతో యాప్‌లో చిత్రాలను పొందుపచ్చాలి. స్టాక్ రిజిష్టర్‌లో సంతకం పెట్టి, చిత్రాలను మూడు రోజుల్లోగా అప్‌లోడ్ చేయాలి. ఎరువుల దుకాణదారులు పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలు వినియోగిస్తున్నారా లేదా తదితర వివరాలు తెలుసుకోవాలి. ఏవోలు, డివిజన్ సహాయ సంచాలకుడు ఐదు దుకాణాలు తనిఖీ చేసి వివరాలు పొందుపర్చాలి. డీఏవో వాటిని సేకరించి అప్‌లోడ్ చేయాలి. జిల్లా కలెక్టర్, డీఏవో మాత్రమే లాగిన్ ఇవ్వటం జరిగింది. తద్వారా ఎక్కడ ఏ మేర ఎరువులు ఉన్నాయో లెక్క ఉంటుంది. కొరత ఉన్న చోటికి ఆయా ఎరువులు సరఫరా చేసే అవకాశం ఉంటుంది. దీంతో రైతులకు ఎరువుల కొరత లేకుండా ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# వర్షాలతో అన్నదాతలకు ముంపు భయం



తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం, నిడదవోలు, నల్లజర్ల ప్రాంత రైతులకు దుఃఖదాయినిగా పేరొంది న ఎర్ర కాలువపై నందమూరు అక్విడెక్టు భయపెడుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో గట్లు పటిష్టం చేసింది. కాని జగన్ సర్కార్ మాత్రం వరదల వల్ల కొట్టుకుపోయిన గండ్లను కూడా పూడ్చలేదు. ఇందుకు కనీసం నిధులు ఇవ్వలేక అధికారులే చేతులెత్తేస్తున్నారు. దీంతో ఎర్ర కాలువ కింద ఉన్న నందమూరు, మారంపల్లి, జగన్నాధపురం, మాధవరం, అప్పారావుపేట, శెట్టిపేట, తాళ్ల పాలెం, కంసాలిపాలెం తదితర గ్రామాల రైతులు వచ్చే వర్షాకాలం తలచుకుని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. అసలే నడివేసవిలో తుఫాన్లు వస్తుంటే ఇక వర్షాకాలంలో పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. నందమూరు అక్విడెక్టు గతంలో పాతది 12 వేల క్యూసె క్కుల నీరు కిందకు వెళ్లే విధంగా అవకాశం ఉండేది. దీంతో ఏ చిన్నపాటి వరద వచ్చినా భారీస్థాయిలో నష్టం కలిగేది. దీంతో పాత అక్విడెక్టు వెనకాల 20 వేల క్యూసెక్కుల సామ ర్థ్యం వున్న అక్విడెక్టు నిర్మించినా పాత అక్విడెక్టు తొలగించక పోవడంతో ఏటా వేలాది ఎకరాల పంట నష్టపోవడం తోపాటు, వరద నీరు గ్రామాల్లో చేరి ఆస్తి నష్టం వాటిల్లేది. ఈ వరదలకు చాలా మంది పిల్లలు, పెద్దలు ప్రాణాలు కోల్పోయారు. 2016లో పాత అక్విడెక్టును టీడీపీ ప్రభుత్వం తొలగించి గట్లను పటిష్టం చేసింది. ప్రస్తుతం వున్న 20 వేల క్యూసెక్కుల అక్విడెక్టు కింద ఐదు ఖానాలు ఉండగా ప్రస్తు తం మూడు ఖానాలు ఇసుక దిబ్బలతో మూసుకుపోయా యి. దీంతో ఎగువ నుంచి వరద నీరు ఏ మాత్రం వచ్చినా గ్రామాలు కొట్టుకుపోయే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఇసుక దిబ్బలు తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు. ఇసుక దిబ్బలు తొలగించేందుకు తమ వద్ద నిధులు లేవని, అవకాశం ఉంటే రైతులనే తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులు సలహా ఇస్తున్నారు. అంత పెద్ద ఇసుక గుట్టల ను ఎలా తొలగించగలమని రైతులు అక్విడెక్టు వద్ద నిరసన తెలుపున్నారు. దీనిపై శెట్టిపేట ఇరిగేషన్ ఈఈ దక్షిణామూ ర్తిని వివరణ కోరగా తమ వద్ద నిధులు లేవని, ఆ ఇసుక గుట్టలు తొలగించాలని నందమూరు రైతులు తమకు చెబితే మీరే తీసుకోండి పర్మిషన్ ఇస్తామన్నామని స్పష్టం చేశారు

# బడి శుభ్రత.. పంచాయతీ బాధ్యత

భూపాలపల్లి :సర్కారు బడులకు వేసవి సెలవులు రావడంతో వాటిని పట్టించుకునే వారే కరవయ్యారు. చెత్తాచెదారంతో ఆవరణలు అధ్వానంగా మారుతున్నాయి. పారిశుద్ధ్యం లోపించి భరించలేని దుర్వాసనతో చాలా రోజుల వరకు తరగతుల గదుల్లో కూర్చోలేని పరిస్థితి తలెత్తుతోంది. చెత్త చెదారాన్ని విద్యార్థులే శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ పరిస్థితి నుంచి బయట పడేసేందుకు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రెండు రోజులకోసారి పారిశుధ్య సిబ్బందితో బడి ఆవరణను శుభ్రం చేసే బాధ్యతను ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించింది. తాజా ఆదేశాలతో వేసవి సెలవుల్లోనూ పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచుతున్నారు. బడులు పునఃప్రారంభమైన తరువాత కూడా వాటిని ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీల పారిశుధ్య సిబ్బంది పరిశుభ్రంగా ఉంచేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఉమ్మడి జిల్లాలో భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాల పరిధిలో మొత్తం 3,328 పాఠశాలలున్నాయి ఇందులో ప్రభుత్వ ప్రాథమిక 2360, ప్రాథమికోన్నత 401, ఉన్నత పాఠశాలలు 567 వరకు ఉన్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో రాత్రి వేళలో పాఠశాలలపై పర్యవేక్షణ లేకుండా పోయింది. దీంతో మందుబాబులు, ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. కొందరు వ్యక్తులు పాఠశాలల్లోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేస్తున్నారు. వీరి నుంచి పాఠశాలలను కాపాడినట్లయితే పరిశుభ్రంగా ఉంటాయి. ఈ ఏడాది సెలవుల్లో వివిధ ఎన్నికలు రావడంతో బడులు ఎక్కువ శాతం పోలింగ్



కేంద్రాలుగా మారాయి. ఆయా కేంద్రాల్లో ఓటర్ల కోసం వసతులు కల్పించే అక్రమంలో నిత్యం అధికారులు పర్యవేక్షించడంతో కొంత వరకు పరిశుభ్రంగానే ఉన్నాయి. వేసవి సెలవుల్లో పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుం టున్నాం. ఇటీవలే ప్రభుత్వం జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. విద్యాసంవత్సరం పునఃప్రారంభమయ్యాక పనిదినాల్లోనూ వాటిని ఆయా పంచాయతీల పారిశుధ్య కార్మికులు, మున్సిపాలిటీ పరిధిలో పురపాలక సంఘం పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించాలని ఆదేశించింది. ఆకతాయిలు సీసాలను పగులగొట్టి వెళ్తుండటంతో వాటిని ఊడ్చే సిబ్బంది ఇబ్బంది పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. రాత్రి వేళ గస్తీ నిర్వహించినట్లయితే వీరి ఆగడాల నుంచి విముక్తి కలుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా గ్రామాల ప్రజలకూ ఉంది.

# కళావిహీనంగా కొల్లేరు



ఏలూరు,: కొల్లేరు.. ఓ పక్క మంచి నీటితో కళకళలాడుతూ మరోపక్క విదేశీ వలస పక్షుల కిలకిలలతో, సందర్శకుల బిజీ తో మనోహరంగా ఉండే కొల్లేరు కళావిహీనంగా మారింది. కొల్లేరు సరస్సు ప్రస్తుతం నీళ్ల లేక బీటలు వారి భూమి నెరలు బారింది. ప్రతి ఏడాది వర్షాకాలంలో వచ్చే వరదల కారణంగా కొల్లేరు పూర్తిగా నీటితో నిండి కళకళలాడుతూ ఉంటుంది. వేసవిలో మాత్రం ఆ నీరంతా ఆవిరై కళావిహీనంగా కనిపిస్తుంది. కొల్లేరులో వలస పక్షులకు నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. మండుతున్న ఎండలకు నీరు ఆవిరి అవుతుండటంతో చేపలు సైతం మృత్యువాత పడుతున్నాయి. కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం 286 ఎకరాల ల్లో నీరు లేక విదేశీ పక్షులు, చేపలు చనిపోతున్నాయి. ఈ పక్షుల కేంద్రంలో 186 రకాల జాతుల పక్షులు విడిది చేస్తుంటాయి. 90 రకాల విదేశీ పక్షులు ప్రతియేటా మార్చి నుండి అక్టోబర్ వరకు ఆటపాక పక్షుల కేంద్రంలో ఉండి సంతానోత్పత్తి చేసుకుని తమ పిల్లలను తీసుకుని విదేశాలకు వెళ్తుంటాయి.పక్షుల కేంద్రంలో అర అడుగు కూడా నీరు లేక ఇంకిపోవడంతో పక్షుల మనుగడ కష్టంగా మారింది. అధిక ఎండలకు నీరు బాగా వేడెక్కి పోవడంతో చేపలు సైతం మృత్యువాత పడుతున్నాయి .పక్షులకు తిండిలేక ఆకలితో అలమటించి చనిపోతున్నాయి. పక్షుల కేంద్రంలో నీరు తక్కువగా ఉండడంతో బోట్ షికారు సైతం నిలిచిపోయింది. పక్షుల కేంద్రమైన 286 ఎకరాల చెరువును నీటితో నింపి నీరు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.సాధారణంగా కొల్లేరు నీటి నిల్వ సామర్థ్యం 40 టీఎంసీలు వరకు ఉంటుంది. అయితే కొల్లేరులో పెద్ద ఎత్తున ఆక్రమణలు పెరిగిపోవడంతో ప్రస్తుతం 7 నుండి 8 టీఎంసీల నీరు కూడా నిల్వ ఉండని పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది తుఫానుల వల్ల 20. అడుగుల పైబడి భారీ వరద నీరు కొల్లేరుకు చేరుకుంది. ఆ నీరంతా ప్రస్తుతం ఆవిరై కొల్లేరు బీడు భూమిలా తయారైంది. కొల్లేరుకు వచ్చిన వరద నీరు అంతా ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళ్ళిపోతుంది. ప్రతి వేసవిలోనూ కొల్లేరులో నీరు ఇంకిపోయి ఉప్పు మడులుగా మారిపోతుంది.కొల్లేరులో నీరు సముద్రంలోకి కలవకుండా నిల్వచేసే విధంగా కొల్లేరు సరస్సులో రెగ్యులేటర్లు నిర్మిస్తామని ఇప్పటికే ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. అయితే ఇప్పటివరకు ఆ హామీలు నెరవేరకపోవడంతో కొల్లేరు ఎప్పటి స్థితిలోనే ఉండిపోయింది. అంతేకాక కొల్లేరుకు ప్రత్యేకంగా విదేశీ పక్షుల సందర్శనం కోసం వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా తగ్గిపోయింది.


# ఏడాదిగా చెరువుల మరమ్మతులో జాప్యం



జయశంకర్ భూపాలపల్లి:ఏడాది కిందట చెరువులు దెబ్బతినగా.. ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. నూతన ప్రభుత్వం ఎన్నిక తర్వాత ప్రతిపాదనలు పంపించినా నిధుల విడుదలలో జాప్యమైంది. తర్వాత లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. కొన్ని చోట్ల నిధులు వచ్చినా.. పాలనాపరమైన అనుమతులు రావడంలో ఆలస్యమైంది. అధికారులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి కొన్ని పనులకు అనుమతులు తీసుకు న్నారు. మేలో అకాల వర్షాలతో మరోసారి పనులకు ఆటంకం కలిగింది. దీంతో కొన్ని చెరువుల్లో పనులు చేపట్టినా ఇంకా కొన్ని చెరువులు ప్రారంభానికే నోచుకోలేదు. ఇప్పటికే వర్షాలు పడుతున్నాయి. జూన్‌లో రుతుపవనాల వర్షాలు రానున్నాయి.. ఈలోగా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 400 చెరువుల వరకు దెబ్బతిన్నాయి. వాటి పరిధిలో కనీసం 60 వేల ఆయకట్టు ఉంటుంది. అందులో సగానికి పైగా యాసంగిలో సాగయ్యేవే.. వరదలకు కొన్ని నామరూపాల్లేకుండా పోయాయి. భూపాలపల్లి జిల్లాలో అత్యధికంగా 165 చెరువులు దెబ్బతిన్నాయి. అందులో 44 చెరువులకు చిన్నచిన్న మరమ్మతులను రైతులే చేసుకున్నారు. 62 చెరువుల్లో తాత్కాలికంగా పనులు చేపట్టగా.. 59 చెరువుల్లో శాశ్వత పనులు చేపడుతున్నారు. తర్వాత ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో దెబ్బతిన్నాయి. జనగామ జిల్లాలో ఇప్పటికీ నిధులు రాకపోవడంతో పనులు చేయడం లేదు. గతేడాది మరమ్మతులకు గురైన చెరువులన్నీ దాదాపు నిరుపయోగంగా మారాయి. కొన్ని చెరువుల మత్తళ్ల కింద పది మీటర్ల లోతు గోతులు పడ్డాయి. పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వాటిని తొలగించుకునేందుకు రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం గుండ్లకర్తి గ్రామ చెరువు పనులు రెండు నెలల క్రితమే ఆరంభించారు. కొంత పని చేసి తర్వాత నిలిపివేశారు. వానాకాలం దగ్గరపడుతున్నా పనులు తిరిగి ప్రారంభించలేదు. ఇలా అసంపూర్తిగా దర్శనమిస్తోంది..

# దస్త్రాల్లో దందా.. అదే వారి పంథా

సర్పవరం :పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేవారికి ప్రభుత్వం సహకారం అందిస్తుంది.. సుశిక్షితులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను పారిశ్రామికవేత్తలకు వివరించండి.. పెట్టుబడులు ఆకర్షించడానికి ప్రయత్నించండి.' ఔత్సాహికులు ముందుకొస్తున్నా జిల్లా పరిశ్రమల శాఖ అధికారుల కొర్రీలతో అడుగులు ముందుకు పడలేదు. అనర్హులను అర్హులుగా చేర్చి రాయితీలు అందించే క్రమంలో రూ.కోట్లు వెనకేసుకోవడం.. అర్హులకు కొర్రీలు వేస్తూ లంచాలు గుంజుకోవడం సాధారణమైంది. "2021లో పరిశ్రమ మంజూరైంది. రాయితీ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నా.. దస్త్రంలో తేదీ తప్పుపడడంతో అది సరిచేస్తేనే రాయితీ వస్తుందన్నారు. రోజూ కార్యాలయానికి రమ్మని.. గంటల తరబడి కూర్చోబెట్టేవారు. 15 నెలలుగా తిరుగుతున్నా పనికాలేదు. రూ.5 లక్షలు ఇస్తేనే పని అవుతుందని కాకినాడ జిల్లా పరిశ్రమల అధికారి అన్నారు. రూ.2 లక్షలు ఇస్తే.. ఇది చాలదు మరో రూ.లక్షన్నర తెమ్మన్నారు. విసిగిపోయి అనిశాకు ఫిర్యాదు చేశాను." కాకినాడ జిల్లా పరిశ్రమల శాఖలో చేయి తడిపితేనే దస్త్రం కదులుతుంది. లేదంటే కొర్రీలే.. కొవిడ్ తర్వాత సూక్ష్మ- చిన్న- మధ్య తరహా పరిశ్రమలు ఆర్థిక ఇబ్బందుల్లోకి కూరుకుపోయాయి. ప్రభుత్వ ప్రోత్సాహం అందక అనేకం మూతపడ్డాయి. పారిశ్రామికవేత్త




లకు రాయితీల మంజూరులోనూ తీవ్ర జాప్యమే.. దీనికీ లంచం ఇవ్వాల్సిందే. కడుపు మండి కొందరు వ్యవహారాన్ని బహిర్గతం చేస్తుంటే.. ఇంకొందరు భవిష్యత్తులో ఇబ్బంది పెడతారన్న భయంతో మిన్నకుండిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 2020లో రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రాయితీ రూ.40.75 కోట్లు ..2021లో రూ.32.10 కోట్లు విడుదల చేశారు. కాకినాడ రూ.11.23 కోట్లు, కోనసీమకు రూ.12.67 కోట్లు మంజూరుచేశారు. 2023లో తూర్పునకు రూ.20.26 కోట్లు.. కాకినాడకు రూ.11.93 కోట్లు.. కోనసీమ జిల్లాలో రూ.11.66 కోట్లు మంజూరుచేసినట్లు వెల్లడించారు. అర్హులకు విడుదలలో వెనుకబాటే. ఒక్క కాకినాడ జిల్లాలోనే 2021-22లో చెల్లించాల్సిన రాయితీలు రూ.10 కోట్లు, 2022-23లో రూ.15 కోట్లు, 2023-24లో రూ.14.22 కోట్ల బకాయిలు ఉన్నాయి.

# శిథిలావస్థలో పశువైద్యశాలలు

నస్పూర్ : జిల్లాలో పశువైద్య శాలలు శిథిలావస్థకు చేరాయి. వైద్యుల పోస్టులు భర్తీ చేయకపోవడం, సిబ్బంది, మందుల కొరత వేధిస్తున్నాయి. జిల్లాలో 44 పశువైద్యశాలలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు పది లక్షల వివిధ రకాల పాడి సంతతికి వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. ఆవులు, ఎద్దులు, గెదెలు, గొర్రెలు, మేకతో పాటు పెంపుడు కుక్కల తదితర వాటికి వైద్య సేవలు మెరుగు పర్చాల్సిన అవసరం ఉంది. పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరి భవనాల పై కప్పుల పెచ్చులు ఊడి పడుతుండడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 44 పశు వైద్యశాలల్లో 15 నుంచి 20 వరకు స్వంత భవనాలు కాగా మిగిలినవి గ్రామపంచాయతీ చెందిన, స్వచ్ఛంద సంస్థల భవనాలల్లో కొనసాగుతున్నాయి. కాసీపేట, దండేపల్లి, తాండూరు, భీమినిలో భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాల పైకప్పుల పెచ్చులు ఊడిపడిపోతున్నాయి. తాత్కాలిక మరమ్మతులు మినహా శాశ్వతమైన పనులు చేయడంలేదు. పెచ్చులు ఊడి పడిపడుతుండడంతో వి?ధులు నిర్వహించడానికి సిబ్బంది భయపడుతున్నారు. ఇదిలా ఉండగా మిగిలిన ఏరియాల్లోని భవనాలు కూడా వివిధ సమస్యలున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోనే పశు వైద్యశాలకు స్వంత భవనం లేకుండా పోయింది. గతంలో ఇక్కడి మార్కెట్ యార్డులో పశు వైద్యశాల ఉండేది. మార్కెట్ యార్డును మెడికల్ కళాశాలకు కేటాయించడంతో ఆసుపత్రిని చున్నంబట్టివాడలోని హౌసింగ్ శాఖ నిర్మిత కేంద్రంలోని ఒక గదిలో ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. జిల్లాలో గెదెలు, ఆవులు, ఎద్దులు-2,85 లక్షలు, గొర్రెలు- 5 లక్షలు, మేకలు-2 లక్షలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 25 గోపాల మిత్ర బృంద సభ్యులు, నియోజక వర్గానికి ఒకటి చొప్పున మొబైల్ సర్వీస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా లో ఆయా వైద్యశాలల్లో కింద స్థాయి సిబ్బంది నుంచి వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు ఏరియా వెటర్నరీ అసుపత్రులు (ఏవీహెచ్), వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్-27 పని చేస్తుండగా ద్వారక, రంగపేటలోని ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండగా, ఉప కేంద్రాల్లో పశు వైద్యులు ఇద్దరు, ఫార్మాసిస్టులు-6, సబార్డినేటర్లు-17 ఖాళీగా ఉన్నాయి.



# విలీన గ్రామాలకు వరం.. అమృత్ 2.0

మహబూబాబాద్,:మహబూబాబాద్ పురపాలక సంఘంలో విలీనమైన గ్రామాలకు అదనంగా నీటి సరఫరా చేసేందుకు అమృత్ 2.0 పథకంలో ప్రారంభించిన పనులు త్వరగా పూర్తయితే ఆ ప్రాంతాలకు నీటి సమస్య తీరనుంది. రాబోయే 30 ఏళ్లలో పెరుగుతున్న జనాభాకు సరిపడా తాగునీటి అవసరాలను తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలక సంఘాల్లో అమలు చేస్తున్న 'అమృత్ 2.0 ' ఆ ప్రాంతాలకు వరంగా మారనుంది. ఇప్పటికే పూర్వ పట్టణంలో అసంపూర్తిగా నిలిచి పోయిన మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేయించారు. దీనికి తోడుగా విస్తరించిన విలీన గ్రామాల్లోని అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు ఈ పథకం ద్వారా రూ. 28.45 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఇతర వ్యయాలు పోనూ రూ. 20.95 కోట్లతో చేపట్టనున్న ఈ పనులకు గత నెలలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కలిసి శంకుస్థాపన చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేస్తే జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య తీరనుంది. గత ప్రభుత్వం మంజూరు చేసిన మిషన్ భగీరథ పథకంలో అప్పటి పూర్వ ఆరు పంచాయతీల్లో పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మించారు. అన్ని ప్రాంతాల్లో పనులు చేయలేదు. ఈ ఐదేళ్ల కాలంలో విలీన గ్రామాలు విస్తరించి జనాభా పెరిగింది. వారి అవసరాలను గుర్తించి మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అధికారులు అమృత్ 2.0 పథకానికి ప్రతిపాదనలను పంపిస్తే నిధులు మంజూరయ్యాయి. అవసరమైన ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, పైపులైన్ల నిర్మాణం చేపట్టి వీటికి పాత ట్యాంకులు, పైపులైన్లు అనుసంధానం చేసి నీటి సరఫరా చేస్తారు. పట్టణంలోని నాలుగు, ఐదు వార్డులకు నీటిని సరఫరా చేసేందుకు పట్టణంలోని నర్సంపేట-ఇల్లందు బైపాస్



రోడ్ సమీపాన ఉన్న గ్రీన్‌లాండ్‌లో 600 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసి ఇప్పటికే గ్రామాల్లో ఉన్న ట్యాంకులకు ఈ పైపులైన్ అనుసంధానం చేసి ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తారు. పట్టణంలోని ఏడో వార్డు పరిధిలో రజా లిపేటకు నీటిని అందించేందుకు సాలార్ తండాలోని గుట్టపై 500 కి.లీ. సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసి నీటిని అంది స్తారు. పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంతో పాటు భవిష్యత్‌లో విస్తరించనున్న అంబేద్కర్ కాలనీ నుంచి ఈదులపూసపల్లి వరకు నిర్మాణమయ్యే ఇళ్లకు నీటిని సరఫరా చేయడం కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 500 కి.లీ. సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేబట్టనున్నారు. నిర్మాణ పనులు ప్రారంభ మయ్యాయని వర్షాల వల్ల నిలిచిన పనులను త్వరగా పూర్తి చేయించి నీటి సమస్యను పరిష్కరించనున్నట్లు కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్ తెలిపారు.

# ఆయిల్‌పాం పెంపకం..
# రైతులకు ఆదాయం

జఫర్‌గడ్, : వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్న ప్రధాన ఉద్దేశంతో ఆయిల్‌పాం తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సాగుకు తక్కువ మొత్తంలో ఖర్చు కావడం, ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుండడం, తెగుళ్ల బెడద పెద్దగా లేకపోవడం వంటి కారణాలతో రైతులు ఆయిల్‌పాం సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పలుచోట్ల రైతులు అంతర పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తుండడంతో రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో మూడేళ్ల కిందట ఆయిల్‌పాం మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఇప్పటి వరకు మొత్తం 5,880 ఎకరాల్లో ఆయిల్‌పాం ను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా రైతులు ఇప్పటికే జిల్లాలో 200 ఎకరాల వరకు సాగుకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 3వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసేలా ఉద్యానశాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఆయిల్‌పాం సాగు వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వంటి అంశాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు రైతులకు పలు రాయితీలు ఇస్తున్నాయి. ఒక్కో మొక్క ఖరీదు రూ.193 కాగా, రాయితీ పోను రైతులు రూ.20 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మొదటి ఏడాది నుంచి నాలుగేళ్ల వరకు ఎకరానికి తోటకు వాడే ఎరువులు, పురుగు మందులు, నిర్వహణ ఖర్చుల కింద ఏటా రూ.2,100లతో పాటు అంతర పంటలు సాగు చేసుకునే వారికి మరో



రూ.2,100 చొప్పున చెల్లిస్తారు. అంటే నాలుగేళ్లలో నిర్వహణ, అంతర పంటల కోసం ఎకరానికి రూ.16,800 చెల్లిస్తారు. ఈ పంట సాగుకు బిందు సేద్యం పద్ధతిలో నీరు అందించాల్సి ఉంటుంది. ఈ బిందు సేద్యానికి కూడా రాయితీ కల్పిస్తారు. ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు ఏటా అందించే నిర్వహణ(ప్రోత్సాహక) నిధులు ఎట్టకేలకు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు రావడం, కోడ్ అమలులో ఉండడం, ప్రభుత్వం మారిపోవడంతో గత ఏడాది నుంచి నిధులు రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

# నిధులు కొరవడి.. పనులు చతికిలబడి!



జయశంకర్ భూపాలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కోసం గత ప్రభుత్వం 2021-22లో 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా ప్రారంభించగా.. పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో బడుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మన ఊరు- మన బడి పథకం పనులను వదిలేయడంతో పనులు అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. జిల్లాలో ఈ పథకం కింద మొదటి విడతగా మొత్తం 149 పాఠశాలలు ఎంపిక చేశారు. అవసరం ఉన్నచోట భవనాలు, అదనపు గదులు, డైనింగ్ హాళ్లు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం, ఇతర పనులు, మరమ్మతులు చేపట్టాలి. డ్యూయెల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు, టేబుళ్లు, కుర్చీలు, ఇలా, ఇతరత్రా సదుపాయాలు కల్పించాలి. అయితే ఎంపిక చేసిన పాఠశాలల్లో గతేడాదే పనులు పూర్తికావాల్సి ఉన్నా.. జాప్యం అయ్యాయి. ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభం సమయంలోనైనా పూర్తవుతాయని భావించినా పనులు పూర్తికాలేదు. ఇప్పటివరకు పూర్తయినవి కేవలం 51 మాత్రమే.. 30పాఠశాలల్లో 70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా కొన్ని ఆరంభానికి నోచుకోకపోగా.. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. పాఠశాలలకు సివిల్ పనుల కింద రూ.22.86 కోట్లు, ఉపాధిహామీ పథకం కింద రూ.18.95 కోట్లు కేటాయించారు. చేసిన పనులకు ఇప్పటివరకు రూ.11.60 కోట్లు చెల్లించారు. ఇంకా చేపట్టిన రూ.2.26 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపేశారు. ఇక్కడ అసంపూర్తిగా కనిపిస్తున్న నిర్మాణం భూపాలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి పథకంలో భాగంగా నిర్మించిన డైనింగ్ హాలు, ఫ్లోరింగ్, పైపులైన్, ప్లంబర్ పనులు చేయాల్సి ఉంది, టేబుళ్లు, కుర్చీలు సమకూర్చాల్సి ఉంది. రూ.80 లక్షలు కేటాయించినా బిల్లులు చెల్లింపుల్లో జాప్యంతో పనులు ఆగిపోయాయి.

# కార్మికులకు అన్యాయం చేస్తారా?

శ్రీరాంపూర్,: 'జాతీయ సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు సర్కారుతో కుమ్మక్కై కార్మికులకు అన్యాయం చేస్తున్నాయి. ఒక్కో కార్మికుడికి రూ. 4 లక్షల వాటా రాకుండా చేశాయి.' అని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. శనివారం శ్రీరాంపూర్ ఆర్కే-6 గనిపై ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్షణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు సర్కారుకు లొంగిపోయి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. రూ. 4701 కోట్ల లాభాల్లో 33 శాతం అంటే రూ. 1551 కోట్లు కార్మికులకు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ కేవలం రూ. 796 కోట్లు ఇస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దమ్ముంటే సింగరేణికి బకాయిలున్న రూ. 23 వేల కోట్లను తెప్పించాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ కార్మికుల పక్షాన నిలబడి.. యాజమాన్య వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నదన్నారు. కార్మికుల కోసం సర్కారు ఆనుకూల సంఘాలు పోరాడ లేవని, దీనివల్ల కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని కార్మికులు గమనించాలని కోరారు. కేసీఆర్ సర్కారులో కార్మికులకు అనేక హక్కులు, సౌకర్యాలు కల్పించామని, ఆయన వల్లే ఈ రోజు 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని గుర్తు చేశారు. రాజకీయజోక్యంతో కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. కొందరైతే ఎమ్మెల్యేలు జీఎంలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు స్నేహ పూర్వక వాతావరణం ఉండేదని తెలిపారు. 33 శాతం లాభాల వాటా ఇవ్వాలని



డిమాండ్ చేస్తూ ఈ నెల 6న గోదావరిఖని హెడ్డాఫీస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టబోతున్నామని, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్ దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ హాజరవుతారని, కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డిప్యూటీ ప్రధాన కార్యర్శి బండి రమేశ్, కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, కేంద్ర నాయకులు ముత్యాల రమేశ్, గొర్ల సంతోష్, మహిపాల్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, ఉత్తేజ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మనిధర్, కిషోర్, చిప్ప రమేశ్, తుర్రం శ్రీకాంత్, రాజేందర్, మధుకర్, చాట్ల రమేశ్ పాల్గొన్నారు.

# సర్కారు భూమి స్వాహా..?

మంచిర్యాల: ముల్కల్ల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్వాహా చేయడం విమర్శలకు తావిస్తున్నది. రెండెకరాల పట్టాభూమిని కొనుగోలు చేసి, దాని పక్కనున్న 10 గుంటల సర్కారు స్థలాన్ని కలుపుకొని ప్లాటింగ్ చేసి విక్రయించేందుకు సిద్ధమవ్వగా, యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నది. ముల్కల్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 169లో ముగ్గురు అన్నదమ్ములకు చెందిన 71 గుంటలు, మరో వ్యక్తికి చెందిన 22 గుంటలు మొత్తం 2.13 ఎకరాల భూమిని ఇద్దరు రియల్టర్లు కొనుగోలు చేశారు. ఈ మేరకు సెప్టెంబర్ 22న అగ్రిమెంట్ సైతం చేసుకున్నారు. మొత్తంగా నలుగురు వ్యక్తుల నుంచి 2.13 ఎకరాలు కొనుగోలు చేసిన ఆ వ్యాపారులు పక్కనే ఉన్న 10 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కలుపుకొని మొత్తం 42 ప్లాట్‌లు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్ వేసి గజానికి రూ.13 వేల చొప్పున విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని ప్లాట్‌లపై అగ్రిమెంట్ చేసుకొని కస్టమర్ల నుంచి అడ్వాన్సులు సైతం తీసుకున్నారు. ఈ లెక్కన వెంచర్‌లో కలిపేసిన 10 గుంటల ప్రభుత్వ భూమిపై రూ.1.57 కోట్లు సమకూర్చుకునేందుకు స్కెచ్ వేశారని తెలిసింది. లే-అవుట్ ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా డీటీసీపీ అనుమతి తీసుకోవాలి. డీటీసీపీకి దరఖాస్తు చేసుకున్నాక గ్రామపంచాయతీకి కొంత భూమిని మార్టిగేజ్ చేసి మిగిలిన ప్లాట్‌లను విక్రయించాలి. ఇలా చేస్తే టైమ్ పట్టడంతో పాటు 10 శాతం ప్లాట్లు పంచాయతీ చేతిలోనే ఉండిపోతాయి. పైగా డీటీసీపీకి పోతే ఆక్రమించే 10 గుంటల వ్యవహారం బయటపడుతుందని.. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెంచర్ ఏర్పాటు చేసేశారు. మరి అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారు%@% అలా చేయడానికి రూల్స్ ఒప్పుకోవు కదా.. అని వెంచర్ నిర్వాహకులను ప్రశ్నిస్తే.. నాలా కన్వర్షన్ చేసి ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేపిస్తామని చెప్పారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అంతా సెట్ చేశామన్నారు. మరి అప్పుడైనా ఈ 10 గుంటల ప్రభుత్వ భూమిని ఎలా నాలా కన్వర్షన్ చేస్తారు.. అంటే రెవెన్యూ అధికారులకు సైతం



ఆమ్యామ్యాలు ముట్టచెబుతామని, అన్నింటికి కలిపే ప్యాకేజీ సెట్ చేసుకున్నామంటూ సమాధానం చెప్పారు. అంటే డీటీసీపీ అనుమతి తీసుకోకుండా అగ్రికల్చర్ ల్యాండ్‌ను నాలా కన్వర్షన్ చేసి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేపిస్తారన్న మాట. ఇది ఈ ఒక్క వెంచర్‌లోనే కాదు.. జిల్లాలో ప్రతి ఇల్లీగల్ వెంచర్‌లో జరిగే ప్రక్రియనేనని తెలిసింది. జిల్లాలో ఎంక్వైరీ చేస్తే ఇలాంటి వెంచర్‌లు వందకు పైగా బయట పడే అవకాశముంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌పై గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. అనుమతులు తీసుకోవాలని నోటీసులు ఇచ్చి ప్లాటింగ్ చేయకుండా అడ్డుకోవాలి. ఒకవేళ ప్లాటింగ్ చేసి ఉంటే ఆ వెంచర్‌లోని రోడ్లు, హద్దు రాళ్లను తొలగించాలి. కానీ విచిత్రం ఏమిటంటే ఈ ఇల్లీగల్ వెంచర్‌కు ఇప్పటి వరకు ముల్కల్ల పంచాయతీ కార్యాలయం నుంచి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఇదే విషయమై ఇటీవల 'నమస్తే తెలంగాణ' పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను సంప్రదించగా అనుమతులు లేకుండా చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దాని యాజమానులను వచ్చి కలవమని చెప్పామ న్నారు. మరి నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి కదా అని అధికారులను ప్రశ్నిస్తే.. రెండు రోజులు చూసి నోటీసులు ఇస్తామన్నారు.

# సోయా కొనుగోళ్లపై సీలింగ్!
# ఎకరాకు 6 క్వింటాళ్లు మాత్రమే సేకరణ

ఆదిలాబాద్,: ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది సోయాబిన్ పంట దిగుబడి ఆశా జనకంగా ఉన్నా కొనుగోళ్లలో ప్రభుత్వం విధించిన నిబంధనలతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో సోయా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో స్థానిక ఎమ్మెల్యే పాయల్‌శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లాలో రైతులు వానాకాలం లో 71,226 ఎకరాల్లో సాయాబిన్ పంటను సాగు చేశా రు. సీజన్‌లో 4,27,356 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేసి ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ఏడాది రైతులు ఊహించిన విధంగా ఎకరాకు 8 క్వింటాళ్లకుపైగా పంట దిగుబడులు వచ్చాయి. పంట కొనుగోళ్లలో ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. ఎకరాకు 6 క్వింటాళ్లు మా త్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. అదనంగా దిగుబడి వచ్చిన పంటను విక్రయించేందుకు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి ఉంటుంది. మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 4892 ఉండ గా ప్రైవేట్ వ్యాపారులు రూ.4300 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాల్‌కు రూ.600 వరకు న ష్టపోవాల్సి వస్తున్నది.



పంట కొనుగోళ్లలో కోతలు విధించడం, తేమ, పంట నాణ్యత పేరిట ధరలు తగ్గిస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట కొనుగోలులో సీలింగ్ ఎత్తివేయాలని రైతుల వద్ద ఉన్న మొత్తం పంటను కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది సోయాబిన్ పంట దిగుబడులు బాగున్నాయి. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రభు త్వం జిల్లాలో నాఫెడ్ ద్వారా సోయాబిన్ పంట కొనుగోళ్లను ఏర్పాటు చేసి ఎకరాకు 6 క్వింటాళ్ల చొప్పున మాత్రమే సేకరిస్తామని అంటున్నారు. పంట కొనుగోళ్లలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం సరికాదు. రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన సోయాను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి. ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు సేకరించాలి. సోయాబిన్‌లో సహజంగా ఎక్కువ తేమ ఉంటుంది.

# డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి
## సర్వేను పరిశీలించిన ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లు

ఎదులాపురం, : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ పైలట్ ప్రాజెక్టు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలోని వార్డు నంబర్ 11, 12లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, రైతు బీమా, రైతు భరోసా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి వివరాలు 30 శాఖలు 30 రకాలుగా సమాచారాన్ని సేకరించడంతో సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని, తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, మావల తహసీల్దార్లు శ్రీనివాస్, వేణు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వార్డు కౌన్సిలర్ షానవాజ్, తదితరులున్నారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని ఆడెగాం(బీ) అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. రిజిష్టర్లు, రికార్డులు, వంట గది, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. చిన్నారులకు చదవడం, రాయడం నేర్పాలని, మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలని సూచిం చారు. అనంతరం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సర్వేను పరిశీలించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ కలెక్టర్ అభిలష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కో సం పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మల్ పట్టణం 42 వ వార్డు(చింతకుంట)లోనిర్వహించిన ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.



అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని ఆడెగాం(బీ) అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. రిజిష్టర్లు, రికార్డులు, వంట గది, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు.

కుటుంబాల ఆధారం గా సర్వే చేస్తున్నామని కొత్త కుటుంబాల వివరాలను ఆధార్ కార్డు ద్వారా నమోదు చేస్తున్నట్లు సర్వే బృందం కలెక్టర్‌కు వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాలు, వార్డుల్లో సర్వేలో తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కల్యాణి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల బాండ్లపై తీర్పు తిరగదోడే ప్రసక్తే లేదు

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేస్తూ రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తిరగదోడే ప్రసక్తే లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆ తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ బిఆర్ గవారు, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. న్యాయవాది మాథ్యూస్ నెడుంపరా, మరొకరు ఈ పిటిషన్లు వేశారు. 'రివ్యూ పిటిషన్లను పరిశీలించిన మీదట రికార్డులో ఎలాంటి పొరపాటు లేదని కనిపిస్తోంది. సుప్రీం కోర్టు నియమావళి-2013లోని ఒకటో క్లాజ్‌లోని 47వ నిబంధన కింద తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదు. అందువల్ల రివ్యూ పిటిషన్లను తోసిపుచ్చుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో అజ్ఞాత ఎన్నికల బాండ్ల పథకానికి మార్గం సుగమం చేస్తూ ద్రవ్య చట్టం, ప్రజా ప్రాతినిధ్య చట్టం, కంపెనీల చట్టం, ఆదాయపన్ను చట్టాలకు చేసిన 2018 సవరణలు రాజ్యాంగ విరుద్ధమంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 15న సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాజకీయ పార్టీలకు వచ్చే నిధులు, విరాళాలు ఎక్కడ నుండి వస్తున్నాయో తెలుసుకునే ప్రాథమిక హక్కు ఓటరుకు వుందని, ఈ పథకం ఆ హక్కును కాలరాస్తోందని కోర్టు వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్లు జారీ చేసే భారతీయ స్టేట్‌బ్యాంక్

వెంటనే బాండ్ల కొనుగోలుదారులు, తీసుకున్నవారి వివరాలను వెల్లడించాలని కూడా కోర్టు ఆదేశించింది.. ఎన్నికల బాండ్ల పథకం బిజెపి రాజకీయ అవినీతి పథకంగా మారింది. దాతలు అజ్ఞాతంగా రాజకీయ పార్టీకి నిధులు పంపడానికి ఈ పథకం అనుమతిస్తున్నది. దీంతో ఇడి, సిబిఐ, ఐటిలను పావులుగా వాడుకుని కంపెనీలను బెదిరించి ఎన్నికల బాండ్ల రూపంలో ముడుపులు పెద్దయెత్తున బిజెపి ఖాతాలో జమ కావడానికి ఇది లాకులెత్తింది.

# తెలంగాణ నుంచి అరుణాచలంకు అందుబాటు ధరలో టూరిజం ప్యాకేజీ!




హైదరాబాద్: తమిళనాడులో పుణ్యక్షేత్రాల్లో ఒకటైనా అరుణాచలంను సందర్శించేందుకు ఇటీవల పెద్ద ఎత్తున భక్తులు ఆసక్తి చూపిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున ఆలయాన్ని సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ టూరిజం భక్తుల కోసం ప్రత్యేక టూరిజం ప్యాకేజీలను ఆపరేట్ చేస్తోంది. హైదరాబాద్ నుంచి అరుణాచలంకు తెలంగాణ టూరిజం 'హైదరాబాద్–అరుణాచలం' పేరుతో ఓ ప్యాకేజీని అందిస్తోంది. హైదరాబాద్ నుంచి ఈ టూర్‌ను ఆపరేట్ చేస్తున్నారు. 3 రాత్రులు, 4రోజుల పాటు ఈ టూర్ సాగుతుంది.

ఇందులో భాగంగా అరుణాచలేశ్వర ఆలయం, కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్ కవర్ అవుతాయి.

ప్రస్తుతం ఈ టూర్ ప్యాకేజీ అందుబాటులో ఉంది. ఇది తప్పితే మరోసారి అవకాశం కల్పించనున్నారు.

ప్రయాణం ఇలా మొదలవుతుంది: మొదటి రోజు హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ నుంచి సాయంత్రం 6.30 గంటలకు ప్రయాణం మొదలవుతుంది. రెండో రోజు ఉదయం 6 గంటలకు కాణిపాకం చేరుకుంటారు. ఫ్రెషప్ అయిన తర్వాత ఉదయం 9 గంటల లోపు దర్శనం పూర్తి చేస్తారు. అనంతరం అక్కడి నుంచి తిరువణ్ణామలైకి బయల్దేరుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అరుణాచలం చేరుకుంటారు. తర్వాత అరుణాచలేశ్వరస్వామి దర్శనం పూర్తి చేసుకుంటారు.

రాత్రి అరుణాచలంలోనే బస ఉంటుంది. ఇక మూడో రోజు ఉదయం టిఫిన్ పూర్తి కాగానే అక్కడి నుంచి బయల్దేరి మధ్యాహ్నానికి వేలూరు బయలు దేరుతారు. సాయంత్రం దర్శనం పూర్తి అవుతుంది. వెంటనే తిరుగు ప్రయాణం మొదలవుతుంది. 4వ రోజు ఉదయం హైదరాబాద్‌కు చేరుకోవడంతో టూర్ ముగుస్తుంది.

**ప్యాకేజీ ధరలు ఇలా:**

ఏసీ బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ టూర్‌లో పెద్దలకు ప్యాకేజీని రూ.8,000, పిల్లలకు రూ.6,400గా నిర్ణయించారు. ఈ ప్యాకేజీలో బస్ జర్నీ, హొటల్స్ కవర్ అవుతాయి. ఆలయాల్లో దర్శనం టికెట్లు, భోజనా నికి పర్యాటకులు స్వంతంగానే ఖర్చు భరించాల్సి ఉంటుంది.

# పడిపోతున్న జాబ్ మార్కెట్




న్యూఢిల్లీ,: ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభం కారణంగా అనేక ప్రముఖ కంపెనీలు కూడా ఉద్యోగ నియామకాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. చిన్న కంపెనీలు అయితే ఖర్చులు తగ్గించుకుంటున్నాయి. ఉద్యోగా నియామకాలు నిలిపివేశాయి. ఉన్నవారిని కూడా తొలగిస్తున్నాయి. కంపెనీలకు ప్రోత్సాహం లేకపోవడంతో భారత్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చదివిన విద్యార్థులకు కూడా ఉద్యోగాలు దొరకడం లేదు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదివిన విద్యార్థుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. తాజాగా బాంబే ఐఐటీలో చదివిన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.4 లక్షలతో ఉద్యోగాలు ఇవ్వడం పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రముఖ కళాశాలల్లో చదివినా ఎక్కువ వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదన్న భావన కనిపిస్తోంది. ఇప్పటికే కాగ్నిజెంట్ నెలకు రూ. 20 వేలతో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే దానిపై సంస్థ వివరణ కూడా ఇచ్చింది. కానీ, ప్రస్తుతం బాంబే ఐఐటీయన్లకు కూడా మంచి వేతనాలు రాకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. బాంబే ఐఐటీలో చదివిన విద్యార్థులకు గతంలో కంపెనీలు రూ.కోటి వేతన ప్యాకేజీతో ఉద్యోగాలు ఇచ్చేవి. కానీ రూ.4 లక్షల అత్యల్ప ప్యాకేజీతో నియమించడం ఆర్థిక సంక్షోభానికి అద్దం పడుతోంది. అయినా విద్యార్థులు ఉద్యోగాల్లో చేరడం ప్రస్తుత జాబ్ మార్కెట్ పరిస్థితిని తెలియజేస్తుంది. ప్రపంచ సంస్థలతో చూసుకుంటే.. బారత్‌ల ఇప్పటికీ కొన్ని ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయి. జీతంతో సంబంధం లేకుండా, అందరికీ కాకపోయినా చాలా మందికి ఆఫర్లు వస్తున్నాయి. అయితే యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలలో పరిస్తితి దారుణంగా ఉంది. కొత్త ఉద్యోగాలు అటుంచి.. ఉన్న ఉద్యోగాలే ఉంటాయో ఊడతాయో తెలియని పరిస్థితి. వాస్తవానికి, ఐఐటీ బాంబే నుండి గ్రాడ్యుయేట్‌లందరికీ ప్లేస్‌మెంట్‌లు రాలేదు. అనేక బహుళజాతి మరియు భారతీయ కంపెనీలు ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలకు వచ్చాయి, కానీ విద్యార్థులు జాగ్రత్తగా ఎంచుకున్నారు. కొందరు కోటి రూపాయల ప్యాకేజీతో ఉద్యోగాలు కూడా పొందారు. మొత్తం 364 కంపెనీలు ఆఫర్ చేశాయి. 1,650 మందికి ఉద్యోగాలు, 22 మంది విద్యార్థులకు కోట్లాది రూపాయల ప్యాకేజీలు వచ్చాయి. ఈ ప్యాకేజీలు ఎలా ఉన్నా, మునుపటి కంటే సంఖ్యలు తక్కువగా ఉన్నాయి. 2,414 మంది విద్యార్థుల్లో 1,979 మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో పాల్గొనగా, 1,475 మంది ఆఫర్ లెటర్‌లు అందుకున్నారు. 78 మంది విద్యార్థులు విదేశాల్లో ఉద్యోగాలు సాధించారు. మిగిలిన వారు ఇప్పటికీ ఉపాధి లేకుండా ఉన్నారు. జాబ్ మార్కెట్ చూసి దేశంలోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు, ఐఐటి విద్యార్థులు సంవత్సరానికి రూ. 4 లక్షల ఆఫర్‌లను అంగీకరించవలసి వస్తే, తమ పరిస్థితి ఏంటని భయపడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి అమెరికాలో చదువుతున్న విద్యార్థులకు అన్నింటికంటే దయనీయమైన దుస్థితి. చాలా మంది ఉద్యోగాలు దొరక్క స్వదేశానికి వెళ్తున్నారు. రానున్న సంవత్సరాల్లో పరిస్థితి మరింత దిగజారుతుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

# రాజీనామాలు సరే... చేరెదెప్పుడు..?

ఏలూరు: వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో కొందరు ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవితో పాటు వైసీపీ ప్రాధమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. అయితే పార్టీలో ఇంత వరకూ చేరలేదు. వైసీపీ నుంచి పోతుల సునీతతో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్సీలు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావులు రాజీనామా చేశారు. రాజీనామా చేసి పది రోజులు దాటుతున్నా తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకోలేదు. అందుకు అనేక కారణాలున్నాయని చెబుతున్నారు. బీద మస్తాన్‌రావు విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ పోతుల సునీత విషయంలో మాత్రం స్థానిక నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోతుల సునీతను పార్టీలో చేర్చుకోవద్దంటూ క్యాడర్ పెద్దయెత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోతుల సునీత టీడీపీలో ఉండేవారు. పోతుల సునీత భర్త పోతుల సురేష్ పరిటాల రవి అనుచరుడు. ఆమెకు తెలుగుదేశం పార్టీలో గతంలో మంచి ప్రాధాన్యత ఇచ్చారు. ఎమ్మెల్సీ పదవి కూడా ఇచ్చి ఆమెకు ప్రయారిటీ ఇచ్చారు. కానీ 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోతుల సునీత టీడీపీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసి వైసీపీలో చేరారు. వైసీపీలో పోతుల సునీతకు మంచి ప్రాధాన్యత ఇచ్చారు. మహిళ అధ్యక్షురాలిగా నియిమించారు. ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. అయితే తిరిగి టీడీపీ అధికారంలోకి రాగానే తనకున్న పరిచయాలతో ఆమె టీడీపీ అధినాయకత్వంలో కొందరికి దగ్గరయ్యారు. దీనికి తోడు టీడీపీకి కూడా శాసనమండలిలో ఎక్కువ మంది సభ్యుల మద్దతు, బలంఅవసరం. అందువల్లరాజీనామా చేసి రావాలని కోరారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా పదవులకు రాజీనామా చేసి రావాలని, అయితే ట్రాక్ రికార్డు ను బట్టి పార్టీలో చేసుకుంటామని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో ఆయన మనసులో మాట అర్థమయింది. వైఎస్ జగన్ పార్టీలో చేర్చుకోవద్దంటూ... పోతుల సునీతను పార్టీలో చేర్చుకోవద్దంటూ టీడీపీ సీనియర్ నేతలు కూడా చంద్రబాబుపై వత్తిడి తెస్తున్నారు. దీంతో ఆమె చేరిక విషయం పెండింగ్ లో పడినట్లయింది. అసలు పార్టీలో చేర్చుకుంటారా? చేర్చుకుని తిరిగి ఎమ్మెల్సీ పదవి ఇస్తారా? అనే విషయంలో సస్పెన్స్ కొనసాగుతుంది. ఇక రేపల్లెకు చెందిన మోపిదేవి వెంకటరమణ పరిస్థి?తి కూడా అంతే. రేపల్లెలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ వర్గం ఆయన చేరికను అడ్డుకుంటోందంటున్నారు. మోపిదేవికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ప్రచారం జరిగింది. అదే జరిగితే రేపల్లెల్లో నియోజకవర్గంలోని టీడీపీలో మళ్లీ గ్రూపులు మొదలవుతాయన్న ఆందోళన వ్యక్తమవు తుంది.

# నిర్దోషులే అత్యధికం



**యుఎపిఎ కేసుల్లో రుజువుకాని నేరారోపణలు**

**2014-2022 మధ్య 8,719 కేసులు**

**215 మంది దోషులు, 567 మంది నిర్దోషులు**

**కేంద్ర ప్రభుత్వ డేటా వెల్లడి**

**తప్పుడు కేసులు పెడుతున్నారని ప్రతిపక్షాల విమర్శ**

న్యూఢిల్లీ : కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం (యుఎపిఎ) కింద నమోదైన కేసుల్లో నేరారోపణలు రుజువు కావడం లేదు. వాటిని రుజువు చేయడం లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు కష్టంగా మారిందని కేంద్రప్రభుత్వం రూపొందించిన డేటా స్పష్టం చేస్తోంది. కేంద్రప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతున్నందు వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. 2014 నుంచి 2022 వరకు యుఎపిఎ కింద మొత్తం 8,719 కేసులు నమోదయ్యాయి. వీటిలో 567 కేసులలో నిందితులు నిర్దోషులుగా తేలింది. 215 కేసులలోనే నిందితులు దోషులుగా తేలింది.

డేటా ప్రకారం.. 2014లో 976 కేసులు నమోదయ్యాయి. ఆ సంవత్సరం తొమ్మిది మంది మాత్రమే దోషులుగా నిర్ధారణ అయ్యింది. 24 కేసులలో నిందితులు నిర్దోషులుగా తేలింది. ఏటా దాదాపు ఇదే పరిస్థితి కొనసాగింది. 2015లో వివిధ పోలీసు బలగాలు, కేంద్ర ఏజెన్సీలు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో యుఎపిఎ కింద 897 కేసులు నమోదయ్యాయి. 11 కేసుల్లో నేరారోపణలు నమోదవగా, 65 కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదలయ్యారు. 2016లో 11 కేసుల్లోనే నేరారోపణలు నమోదయ్యాయి. 22 కేసుల్లో నిర్దోషులుగా విడుదలయ్యారు. 2017 సంవత్సరంలో నిందితులు 34 మంది కాగా, 33 నిర్దోషులుగా విడుదలయ్యారు. దేశవ్యాప్తంగా 901 కేసులు నమోదు చేయబడ్డాయి. 2018, 2019లో వరుసగా.. 1,182 కేసులు, 1,226 కేసులు నమోదయ్యాయి. 2018లో 68 కేసుల్లోనూ, 2019లో 64 కేసుల్లోనూ నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. 2020లో నిర్దోషుల సంఖ్య 99కి పెరిగింది. నేరారోపణలు 27కి తగ్గాయి. 2021లో 39 మంది నిర్దోషులుగా, 27 కేసులలో నేరారోపణలు కొనసాగాయి. 2022 సంవత్సరంలో అత్యధికంగా 153 మంది నిర్దోషులుగా ఉన్నారు. ఆసంవత్సరం కేవలం 36 నేరారోపణలు మాత్రమే నమోదయ్యాయి. యుఎపిఎ కింద కేసుల్లో నేరారోపణలు రుజువు చేయడం కష్టసాధ్యంగా ఉందని, అటువంటి కేసులలో దర్యాప్తును నిర్వహించడంలో విపరీతమైన సంక్లిష్టత ఎదురవుతోందని, దీనికి ఉన్నత స్థాయి వృత్తి నైపుణ్యం అవసరమని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ప్రతిపక్షాలపై కక్షసా ధింపు చర్యల్లో భాగంగా తప్పుడు కేసులు పెడుతున్నారని, అందువల్లే నేరాలు రుజువు కావడం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ వైఖరి మానుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# రోజా రీ ఎంట్రీ..



తిరుపతి, : మాజీ మంత్రి ఆర్కే రోజా ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కనిపించకుండా పోయారు. ఆమె ఎక్కువగా చెన్నైలోనో, లేక కుటుంబ సభ్యులతో కలసి విదేశాల్లోనూ పర్యటిస్తూ కాలం గడిపేవారు. పుణయ క్షేత్రాలను దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దాదాపు వంద రోజుల నుంచి ఆమె విజయవాడ వైపు కూడా రాలేదు. పార్టీ అధినేత జగన్ ను వచ్చి కలిసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో ఆర్కే రోజాపై అనేక రకమైన ప్రచారం జరిగింది. ఆమె తమిళనాడు రాజకీయాల్లోకి వెళుతున్నారని, హీరో విజయ్ పెడుతున్న పార్టీలో చేరి తమిళనాడు రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరిగింది. అందుకు తగిన విధంగానే ఆర్కే రోజా రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఉండటంతో నిజమేనని నమ్మిన వాళ్లుచాలా మంది ఉన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆర్కే రోజాకు మంచి ప్రయారిటీ ఇచ్చారు. మంత్రి పదవి ఇవ్వకముందు నామినేటెడ్ పదవి ఇచ్చారు. అదే సమయంలో మంత్రి వర్గ విస్తరణలో ఆమెకు చోటు కల్పించి చిత్తూరు జిల్లా నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఆర్కే రోజాకు ఉందని జగన్ పార్టీ నేతలకు చెప్పకనే చెప్పారు. చిత్తూరు జిల్లాలో చాలా మంది ఆర్కే రోజాకు వ్యతిరేకమయినా జగన్ వారెవ్వరినీ లెక్క చేయకుండా మంత్రిపదవి ఇవ్వడంతో ఆమె మరింత రెచ్చిపోయారు. తన సొంత నియోజకవ ర్గంలోని నగరిలోనూ వైసీపీ నేతలను దూరం చేసుకున్నారు చివరకు ఎన్నికల సమయంలో అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థులను జగన్ మార్చారు. ఐ ప్యాక్ టీం ఇచ్చిన నివేదికలను అనుసరించి అభ్యర్థుల ను మార్చారు. కొందరినిమరొక నియోజకవర్గాలకు పంపించి వేశారు. రోజాను కూడా నగరి నుంచి మారుస్తారన్న ప్రచారం జరిగింది. అయితే జగన్ మాత్రం చివరకుఆర్కే రోజాకు నగరిటిక్కెట్ ను ఖరారు చేశారు. దీంతోఆమె ఖుషీ అయ్యారు. ఆఖరుకు రోజాకు వ్యతిరేకంగా ఉన్న పార్టీ నేతలతో జగన్ స్వయంగా మాట్లాడి రోజా గెలుపునకు సహకరించాలని కోరారు. కానీరాష్ట్రంలో కూటమిగాలి బలమైన గాలు లు వీయడంతో ఆర్కే రోజా కూడా దారుణంగా గాలి భానుప్రకాష్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే ఆర్కే రోజా ఇప్పటి వరకూ జరిగిన ప్రచారానికి తెర దింపారు. తిరిగి రాష్ట్ర రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం లేదని నిలదీశారు. ఇక విజయవాడ వరదల్లో ప్రభుత్వం అట్టర్ ఫెయిల్యూర్ అంటూ మండిప డ్డారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కూడా షో చేయడం తప్ప బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నం చేయడం లేదని అన్నారు. ముందుగా ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమ య్యారని తెలిపారు. మొత్తం మీద ఆర్కే రోజా రాజకీయంగా యాక్టివ్ కావడం పట్ల క్యాడర్ లో సంతోషం కనపడుతుంది.

# తిరుమలలో ఆధార్ ప్రామాణికంగా సేవలు!



తిరుమల, : తిరుమలలో శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఆధార్ ప్రామాణికంగా సేవలు అందించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాథమికంగా అనుమతి లభించిం దని టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకు సంబంధిం చిన నోటిఫికేషన్ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నుండి వెలువడనుందని వివరించారు. ఫలితంగా దర్శన, వసతి, శ్రీవారి సేవ తదితర సేవల ను దుర్వినియోగం చేస్తున్న దళారులను అరికట్టవచ్చని చెప్పారు. అన్నమయ్య భవనంలో డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. శ్రీవారి భక్తులకు మరింత పారదర్శకంగా లడ్డూ ప్రసాదాలు అందిం చాలనే లక్ష్యంతో దర్శనం టోకెన్ లేని వారికి ఆధార్‌తో లడ్డూలను అందించే విధానాన్ని టీటీడీ ప్రవేశపెట్టిం దని ప్రకటించారు. గత కొన్నేళ్లుగా పలువురు దళారులు లడ్డూల బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించాం. తిరుమలలో దళారి వ్యవస్థను అరికట్టి, స్వామివారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి తగినన్ని లడ్డూలు అందించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందు లో భాగంగా, దర్శనం టోకెన్లు లేనివారికి ఆధార్ కార్డుపై రోజువారి రెండు లడ్డూలను మాత్రమే జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. అలాగే చాలా కాలంగా భక్తులు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ, బయట ప్రాంతాలలో ఉన్న టీటీడీ ఆలయాలు, చెన్నై, బెంగళూరు, వెల్లూరు లలోని టీటీడీ సమాచార కేంద్రాలలో లడ్డూల డిమాండ్ ఉన్నప్పటికి మేము పంపలేకపోయాము. ప్రస్తుతం పంపిస్తున్నాం. గత నాలుగు రోజుల్లో దాదాపు 75 వేల లడ్డూలు పంపబడ్డాయి" అని ఈవో శ్యామలరావు వివరించారు. తిరుమలలో దర్శనం టోకెన్లు ఉన్న భక్తుల కు ఒక ఉచిత లడ్డూతో పాటు, రూ.50/– ప్రాతిపదికన కోరినన్ని లడ్డూలు (స్టాక్ లభ్యత ఆధారంగా) అందజేస్తున్నామని స్పష్టం చేశా రు. దీనికి ఆధార్ కార్డు అవసరం లేదన్నారు. ఆవు నెయ్యి నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు లడ్డూ ప్రసాదాల నాణ్యతను పెంచేందుకు, సువాసన, రంగు, రుచి ఉండే నెయ్యి కొనుగోలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న టెండర్ షరతులను అనుసరించి నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. గతంలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన కాంట్రా క్టర్లను బ్లాక్ లిస్ట్ పెట్టడం జరిగిందని వెల్లడించారు. టోకెన్లు జారీ చేయు కౌంటర్లు మరియు గాలిగోపురం వద్ద స్కానింగ్ కౌంట ర్లను త్వరలో పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈవో పేర్కొన్నారు. నెల మొదటి వారంలో యాత్రికులకు వారానికి 1.05 లక్షల ఎస్ఎస్ డిటోకెన్లు ఇవ్వగా, ఇప్పుడు వారానికి 1.63 లక్షల టోకెన్‌లు జారీ చేస్తున్నాం. ఎస్ఎసడి టోకెన్స్ పెంచిన కారణంగా ఈ టోకెన్ పొందిన భక్తుల నిరీక్షించే సమయం గణనీయంగా తగ్గింది" అని ఈవో ప్రకటించారు.

# మళ్లీ గవర్నమెంట్ వర్సెస్ గవర్నర్!

చెన్నై: తమిళనాడులో గవర్నర్‌కు, అక్కడి ప్రభుత్వానికి మధ్య వ్యవహారం ఎప్పుడూ ఉప్పు నిప్పుగానే ఉంటుంది. మరోసారి అలాం టి పరిస్థితులు ప్రారంభమయ్యాయి. గవర్నర్ సీటీ రవి టీచర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు తమిళనాడులోనే ప్రభుత్వ స్కూల్స్ పరిస్థితిపై విమర్శలు చేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని పూర్తిగా వెనుకబడిపోయారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారిలో 75 శాతం మందికి రెండు అంకెల సంఖ్యను గుర్తించడం చేతకావడం లేదని టీచర్స్ డే కార్యక్రమంలో గవర్నర్ రవి అన్నారు. అలాగే నలభై శాతం మంది తొమ్మిది తరగతి విద్యార్థులు రెండోతరగతి పుస్తకాలను చదవలేకపోతున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్ని చక్కదిద్దాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదనిగవర్నర్‌వ్యాఖ్యానించారు. గవర్నర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. అయితే తమిళనాడులో విద్యావిధానం చాలా గొప్పగా ఉందని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. మంచి సిలబస్.. స్వతంత్ర, విశాలమైన ఆలోచనల్ని ప్రోత్సహిస్తుందని ఇలాంటి వాటిని బేరీజు వేసుకుంటే దేశంలోనే తమిళనాడు సిలబస్ అత్యంత విజయ వంతమైనదన్నారు. దేశవ్యాప్తంగా తమిళనాడు విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. ఐటీ ఇండస్ట్రీలో తమిళ యూత్ తమదైన ప్రతిభ చూపుతున్నారని సిలబస్ బాగోలేకపోతే వీరంతా ఎలా ఎదుగుతారని ఉదయనిధి ప్రశ్న. గవర్నర్ వ్యాఖ్యలు తమవిద్యార్థులు, టీచర్లను అవమానించేలా ఉన్నాయన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను సహించే ప్రశ్నే లేదన్నారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గవర్నర్ వచ్చిన సీటీ రవి అనేక సమస్యలు సృష్టిస్తూనే ఉన్నారు. బిల్లులు ఆమోదించకపోవడం.. వంటివి చేశారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215